నేటి కందం- నేటికి అందం

గోసందపు టందముతో
లాసకముగ దోచు మన తెలంగాణములో
శాసన మండలి భవనును
భాసురముగ ముఖ్యమంత్రి ప్రారంభించెన్ !!

(తెలంగాణా శాసన మండలి క్రొత్త భవనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

అభివృద్ధిలో వాళ్లే
అవుతుంటే కీలకం
గుర్తింపు ఎందుకింకా
గతితప్పే వాలకం.
ప్రభుత్వం వేదికలపై
ప్రశంసలు కురిపిస్తది
పంజరంలో సమాజం
పావురంగా మెరిపిస్తది



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 10-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:166 పేజీలు:6 వెల: రూ.1/-


## నాణ్యతలేని మందులపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు..

హైదరాబాద్, మార్చి 9: నాణ్యతలేని మందుల విక్రయాన్ని అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) ఆధ్వర్యంలో బల్క్ ఎస్ఎంఎస్ అలర్ట్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ వ్యవస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులకు వెంటనే సమాచారం అందించేలా చర్యలు తీసుకున్నారు.

రాష్ట్రంలో ఎక్కడైనా నాణ్యతలేని, అనుమానాస్పద మందులు గుర్తించిన వెంటనే అన్ని మెడికల్ షాపులకు ఎస్ఎంఎస్ ద్వారా అలర్ట్ పంపిస్తున్నారు. దీంతో ఆ మందుల విక్రయాన్ని వెంటనే నిలిపివేయాలని మెడికల్ షాపులకు సూచనలు అందుతాయి.

ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యం..

ప్రజలకు హానికరంగా మారే మందులు మార్కెట్‌లో అమ్మకుండా ముందుగానే అడ్డుకోవడమే ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. నాణ్యతలేని మందులు అమ్మడం వల్ల రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఈ చర్యలను చేపట్టింది.

రాష్ట్రవ్యాప్తంగా అనుసంధానం

ఈ కొత్త వ్యవస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులను ప్రభుత్వం అనుసంధానం చేస్తోంది. ఒకసారి అలర్ట్ జారీ అయిన వెంటనే ప్రతి ఫార్మసీకి సమాచారం చేరేలా డిజిటల్ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు.

డిజిటల్ పర్యవేక్షణకు ప్రాధాన్యం

ఔషధాల నాణ్యత, పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు డిజిటల్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టి మందుల నియంత్రణను మరింత కట్టుదిట్టం చేసేలా డీసీఏ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

## లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు.. వైట్ ఫాస్ఫరస్ ప్రయోగించిందన్న మానవ హక్కుల సంఘం



న్యూఢిల్లీ, మార్చి 9: లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఒక పక్క ఇరాన్‌పై యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్ మరోవైపు లెబనాన్‌పై కూడా దాడులకు దిగింది. ఈ రెండు దేశాల మధ్య కూడా దశాబ్దాలుగా వైరం నడుస్తోంది. వారం రోజుల నుంచి ఇరాన్.. లెబనాన్‌పై దాడులకు పాల్పడుతోంది. ఈ దాడుల్లో ఇప్పటివరకు 400 మందికిపైగా లెబనాన్ ప్రజలు మరణించినట్లు ఆ దేశం ప్రకటించింది. లెబనాన్ రాజధాని బీరుట్‌పై కూడా దాడి చేసింది. ప్రజల నివాసాలపై కూడా మిస్సైళ్లతో విరుచుకుపడింది. ఈ క్రమంలో పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు.

ఇదే సమయంలో ఇప్పుడు ఇజ్రాయెల్ చేసిన ఒక పని వివాదానికి కారణమైంది. లెబనాన్‌పై దాడుల్లో భాగంగా ప్రజల నివాసాలపై వైట్ ఫాస్ఫరస్ ప్రయోగించినట్లు తేలింది. ఈ నెల 3న లెబనీస్ పట్టణమైన యోమోర్‌పై జరిపిన దాడిలో ఇండ్లపై వైట్ ఫాస్ఫరస్ చల్లినట్లు అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం గుర్తించింది. దీనికి సంబంధించిన ఆధారాల్ని కూడా సేకరించింది. దీని ద్వారా రెండు ఇండ్లు, ఒక కారు మంటల్లో చిక్కుకున్నాయి. అక్కడి ఫైర్ అధికారులు స్పందించి మంటలు ఆర్పేశారు. ఈ వైట్ ఫాస్ఫరస్ చల్లిన తర్వాత చిన్న నిప్పురవ్వ అంటుకున్నా మొత్తం మంటలు వ్యాపిస్తాయి. ఇలాంటి చర్యలకు అనుమతి ఉండదు. అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంగా, నిబంధనలకు విరుద్ధంగా ఇజ్రాయెల్ ఇలాంటి పని చేస్తుందని, దీనివల్ల తమ పౌరుల ప్రాణాలకు తీవ్ర ముప్పు ఉంటుందని లెబనాన్ అధికారులు అన్నారు.

వీటి ద్వారా ఎవరైనా గాయాలపాలైనా వాటి ప్రభావం చాలాకాలం ఉంటుందని తెలిపారు. వైట్ ఫాస్ఫరస్‌ను బాంబులు, షెల్స్, రాకెట్లు వంటి వాటిలో వాడుతారు. ఈ కెమికల్ ఆక్సిజన్ రియాక్షన్‌కు గురైనా మంటలు అంటుకుంటాయి. అందుకే అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఈ కెమికల్‌ను వాడటం, పౌరులకు హాని చేయడం నేరం. మిలిటరీ కార్యక్రమాలకే దీన్ని వాడాలి.

## విద్యార్థికి గుండు కొట్టించిన ఉపాధ్యాయుడు .. బ్లాక్ బోర్డ్ స్కూల్‌లో ఘటన

హైదరాబాద్, మార్చి 9: విద్యార్థికి బలవంతంగా గుండు గీయించిన సంఘటన హాఫీజ్‌పేట్‌లోని బ్లాక్ బోర్డ్ స్కూల్ చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బ్లాక్ బోర్డ్ ది స్కూల్ లో 9వ తరగతి చదువుతున్న ఈశ్వర్‌కు లక్ష్మి నరసింహ స్వామి మొక్కు ఉండటంతో జుట్టు పెంచుకున్నాడు. కాగా, జుట్టు విషయమై స్కూల్ ఉపాధ్యాయులు హెచ్చరించగా మొక్కు ఉన్నట్లు ఈశ్వర్ తెలిపాడు. హెచ్చరించిన అలానే జుట్టు ఉంచుకోవడంతో కోపోద్రిక్తుడైన ఉపాధ్యాయుడు శనివారం ఈశ్వర్‌కు బలవం తంగా గుండు గీయించాడు.

మొక్కు ఉన్న కూడా అలా ఎలా చేయిస్తారంటూ తల్లిదండ్రులు సదరు ఉపాధ్యాయుడిని నిలదీయగా తప్పయిందంటూ క్షమాపణలు చెప్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

స్కూల్ యాజమాన్యంపై ఉన్నత అధికారులు తగిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం అవ్వకుండా చూడాలంటూ కోరుతున్నారు. కాగా సంఘటనపై స్పందించిన మండల విద్యాధికారి వెంకటయ్య.. సంఘటనపై విచారం వ్యక్తం చేస్తూ.. వెంటనే పాఠశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేయడంతో పాటు, డీఈఓ దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

## రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నిక: రిటర్నింగ్ అధికారి

హైదరాబాద్, మార్చి 09: తెలంగాణ నుంచి నామినేషన్ దాఖలు చేసిన ఇద్దరు అభ్యర్థులు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున వేం నరేంద్ర రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు రాజ్యసభకు ఎన్నికైనట్లు ఆయన వివరించారు. అందుకు సంబంధించిన పత్రాలను కాసేపట్లో వీరికి అందజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ పత్రాలను అందుకోవడానికి అభిషేక్ మను సింఘ్వీ తరఫున అడ్వకేట్ సుందర్ చౌహాన్ తెలంగాణ అసెంబ్లీలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. అలాగే మరికాసేపట్లో వేం నరేందర్ రెడ్డి అసెంబ్లీ కార్యాలయానికి రానున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొనున్నారు. రాజ్యసభలో పలువురి సభ్యుల పదవి కాలం ఏప్రిల్‌లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. గురువారంతో నామినేషన్ల ప్రకియ ముగిసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ తరఫున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన రాజ్యసభ ఎన్నికల కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

యాదాద్రి భువనగిరిమార్చి 9: జిల్లాలోని భువనగిరి మండలం వడపర్తి గ్రామ శివారులో అమ్మ అనాధ శరణాలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఇద్దరు యువకులు, ఓ మహిళ మృతి చెందారు.

రెండు డీసీఎంలు అతి వేగంతో ఆటోని ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది . మృతులు బీఎన్ తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తల్లి కొడుకులు నరేష్, సురేష్, కేతమ్మ గా పోలీసులు గుర్తించారు. నరేష్ వికలాంగుడు కాగా, స్పాట్ లోనే మృతి చెందాడు. సురేష్ భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

కేతమ్మ మెరుగైన చికిత్స నిమిత్తం హైద్రాబాద్ తీసుకు వెళుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సురేష్ ఆర్టీసీ లో కాంట్రాక్ట్ విధానం లో పని చేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. బీఎన్ తిమ్మాపూర్ నుంచి భువనగిరి కి వెళ్లి, పనులు చూసుకొని తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి లోనయ్యారు. మృత దేహాలను శవ పరీక్ష నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రి మార్చ్యూరి కి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై ఆగని దాడులు..

## 16 ఏళ్ల హిందూ బాలుడి దారుణ హత్య

బంగ్లాదేశ్ , మార్చి 9: బంగ్లాదేశ్ లో మైనారిటీలు అయిన హిందువులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఫెనీ జిల్లా లో ఆటోను దొంగిలించేందుకు యత్నించిన కొందరు దుండగులు.. 16 ఏళ్ల హిందూ బాలుడి ని దారుణంగా హత్య చేశారు. ఢాకా-చిట్టగాంగ్ హైవేపై లాల్‌పోల్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుందని అక్కడి మీడియా తెలిపింది.

హత్యకు గురైన బాలుడు శాంతో కుమార్ సాహాగా పోలీసులు గుర్తించారు. అక్కడి మీడియా కథనం ప్రకారం.. మియాజీ ఫిల్లింగ్ స్టేషన్ ముందు ఆటోలో ప్రయాణికుడి కోసం శాంతో ఎదురుచూస్తుండగా.. కొందరు దుండగులు అతడిపై దాడిచేసి, ఆటోను లాక్కునే ప్రయత్నం చేశారు. శాంతో వాళ్లను ప్రతిఘటించడంతో హైవే పక్కన ఉన్న కల్వర్టు కిందకి తోసేశారు. అయినా వెంటనే తేరుకుని దొంగలను వెంబడించిన శాంతోను వారు హత్యచేశారు.

రోడ్డుపై వేగంగా వస్తున్న వాహనం కిందకి శాంతోను తోసేశారు. దాంతో ఆ వాహనం ఢీకొని బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. రాత్రి వరకు బాలుడి ఆచూకీ లేకపోవడంతో కుటుంబసభ్యులు గాలిస్తుండగా.. తెలిసిన ఆటో డ్రైవర్ ద్వారా సమాచారం అందినట్లు శాంతో బంధువులు తెలిపారు.

శాంతో ప్రయాణికులను ఎక్కించుకున్న ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తే నిందితులను గుర్తించే అవకాశం ఉందని అతడి కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఇఫ్తార్ సమయంలో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని ఆసరాగా తీసుకుని దుండగులు బాలుడిని టార్గెట్ చేసి, ఆటోను ఎత్తుకెళ్లారని రోపించారు. బంగ్లాదేశ్‌లో కొత్తగా ఏర్పడిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ప్రభుత్వ హయాంలోనూ హిందూ వర్గాలపై దాడులు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో మహమ్మద్ యూనస్ పాలనలోనూ మైనారిటీలపై వరుసదాడులు జరిగాయి.

## పాదచారులపైకి దూసుకెళ్లిన బస్సు..

## ఇద్దరు మృతి.. బస్సును తగలబెట్టిన స్థానికులు



న్యూఢిల్లీ, మార్చి 9: ఢిల్లీలోని నంగ్లోయి ప్రాంతంలో దారుణం జరిగింది. ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (డీటీసీ)కి చెందిన బస్సు పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన సోమవారం ఉదయం, నంగ్లోయి ప్రాంతంలో జరిగింది. ఈ ఘటనతో స్తానికులు కోపోద్రిక్తులయ్యారు. ప్రమాదానికి కారణమైన బస్సును ధ్వంసం చేసి, దహనం చేసేందుకు ప్రయత్నించారు.

సోమవారం ఉదయం బస్సు వేగంగా వెళ్తూ స్కూటీపై వెళ్తున్న ఒక యువకుడిని, అలాగే ఇ-రిక్షా కార్మికుడిని, మరికొందరిని ఢీకొంది. ఈ ఘటనలో స్కూటీపై ఉన్న యువకుడిపైకి బస్సు ఎక్కడంతో అతడు అక్కడే మరణించాడు. అలాగే మరో వ్యక్తి కూడా ప్రాణాలు కోల్పోయాడు. ఇంకొందరు గాయపడ్డట్లు సమాచారం. ప్రమాద ఘటనతో స్థానికులు ఆగ్రహానికి గురయ్యారు. బస్సు అద్దాల్ని ధ్వంసం చేశారు. బస్సుకు నిప్పు పెట్టారు. దీనిపై పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది గంటపాటు శ్రమించి మంటలు ఆర్పేశారు. ఉద్రిక్తతలు తలెత్తకుండా అక్కడి ఆందోళనకారులను చెదరగొట్టారు. ధ్వంసమైన బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతదేహాల్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం కోసం తరలించారు. క్షతగాత్రుల్ని స్థానిక సంజయ్ గాంధీ మెమోరియల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఇటీవలి కాలంలో డీటీసీకి చెందిన బస్సులు అనేక ప్రమాదాలకు కారణమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తు?న్నారు. ఒక నివేదిక ప్రకారం 2024-25లో ఢిల్లీలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించి 150 ప్రమాదాలు జరగగా,40 మంది మరణించారు. ఇందులో డీటీసీ బస్సుల వల్లే 97 ప్రమాదాలు జరగగా, 21 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు.

## రైతుల రుణాలపై కేంద్రం కీలక ప్రకటన



న్యూఢిల్లీ, మార్చి 09: దేశవ్యాప్తంగా రైతులకు వ్యవసాయ రుణాలు కింద మొత్తం రూ.31,34,807 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సోమవారం లోక్‌సభలో డీఎంకే సభ్యుడు రాజు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. పంట రుణాలు కింద రూ.16,34,219 కోట్లు.. టర్మ్ లోన్స్ కింద రూ.15,00,588 కోట్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే పలు రాష్ట్రాల రైతుల అప్పుల భారాన్ని ఈ సందర్భంగా గణాంకాలతో సహా వెల్లడించారు. ఈ జాబితాలో తమిళనాడు అగ్రస్థానంలో నిలవగా.. తెలుగు రాష్ట్రాలు ఏపీ రెండు, తెలంగాణ ఏడో స్థానాల్లో ఉన్నాయి.

రాష్ట్రాల వారీగా ఎక్కువ రుణాలు ఉన్న రాష్ట్రాలు

1. తమిళనాడు: రూ.5,06,290 కోట్లు
2. ఆంధ్రప్రదేశ్: రూ.3,75,254 కోట్లు
3. మహారాష్ట్ర: రూ.3,07,293 కోట్లు
4. ఉత్తరప్రదేశ్: రూ.2,30,096 కోట్లు
5. కర్ణాటక: రూ.2,10,244 కోట్లు
6. రాజస్థాన్: రూ.1,92,293 కోట్లు
7. తెలంగాణ: రూ.1,75,960 కోట్లు
8. మధ్యప్రదేశ్: రూ.1,70,757 కోట్లు
9. గుజరాత్: రూ.1,68,460 కోట్లు
10. కేరళ: రూ.1,61,023 కోట్లు

## ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా ఖమేనీ తనయుడు

## మొజ్తాబా ఖమేనీ.. ప్రకటించిన ఇరాన్

ఇరాన్ ,మార్చి9: ఇరాన్ తమ దేశ నూతన సుప్రీం లీడర్‌ను ఎన్నుకుంది. కొత్త సుప్రీం లీడర్‌గా అయతొల్లా ఖమేనీ తనయుడు మొజ్తాబా ఖమేనీని ఎన్నుకున్నట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. 56 ఏళ్ల అయతొల్లా సయ్యద్ మొజ్తాబా హృస్సేని ఖమేనీ అలియాస్ మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌కు మూడో సుప్రీం లీడర్‌గా ఎన్నికయ్యాడు. మొజ్తాబాను ఇరాన్ అసెంబ్లీ నిపుణుల బృందం ఎన్నుకుంది.

ఇందులో 88 మంది ఇస్లాం మత గురువులు ఉంటారు. వీరందరూ కలిసి ఆదివారం సమావేశమై కొత్త సుప్రీం లీడర్ కోసం చర్చ జరిపారు. మెజారిటీ సభ్యులు మొజ్తాబా వైపు మొగ్గు చూపారు. కొందరు సభ్యులు వారసత్వ నాయకత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ.. మెజారిటీ ఉండటంతో మొజ్తాబానే ఎన్నుకున్నారు. ఒకవైపు ఇరాన్‌పై దాడులు కొనసాగుతున్నా, మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ కొత్త లీడర్ ఎంపికను ఇరాన్ పూర్తి చేసింది. అతడు, ఎప్పటినుంచి బాధ్యతలు స్వీకరిస్తారో తెలియరాలేదు. మొజ్తాబాకు విదేశాల్లో భారీగా ఆస్తులున్నాయి. అతడికి లండన్‌లో దాదాపు 2,500 కోట్లకుపైగా ఆస్తులున్నట్లు అంచనా. కెన్సింగ్‌టన్ ప్యాలెస్‌లో అతడికి ఖరీదైన అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. 2014 నుంచి లండన్‌లో ఆస్తులు కలిగి ఉన్నాడు. అక్రమ చమురు అమ్మకాల ద్వారా ఇదంతా సంపాదించినట్లు ప్రచారం జరుగుతోంది.

ఇక ఇటీవలి పరిణామాల నేపథ్యంలో లండన్‌లోని అతడి ఆస్తులపై ఇజ్రాయెల్, అమెరికా నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. అతడి ఆస్తులకు భద్రతాపరమైన ముప్పు ఉందని నిపుణులు అంచనావేస్తున్నారు. మరోవైపు మొజ్తాబా ఎంపికను అమెరికా, ఇజ్రాయెల్ అంగీకరించడం లేదు. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునేముందు తమ అనుమతి తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. అలాగే కొత్త లీడర్ ఎవరైనా సరే అంతం చేస్తామని ఇజ్రాయెల్ ఇదివరకే ప్రకటించింది.

## మొజ్తాబా ఖమేనీకి పుతిన్ అభినందనలు, కొత్త సుప్రీంను టార్గెట్ చేయవద్దన్న చైనా

టెహ్రాన్, మార్చి9: అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు జరిపి ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీని మట్టుబెట్టడంతో పశ్చిమాసియాలో తలెత్తిన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. మధ్యప్రాచ్యంలో ఇజ్రాయెల్ తన దాడులను లెబనాన్, బీరుట్‌కు విస్తరించింది. ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. ఇరాన్‌ను విడగొట్టి దేశం నుంచి చమురును తరలించాలని అమెరికా ప్లాన్ చేస్తోందని టెహ్రాన్ ఆరోపిస్తోంది. ఇరాన్ కొత్త సుప్రీం నేతగా ఎన్నికైన మొజ్తాబా ఖమేనీకి పూర్తి బాసటగా నిలుస్తామని ఆదేశ మిలటరీ ప్రకటించింది. తాజాగా ఇరాన్ కొత్త సుప్రీం నేతకు రష్యా అభినందనలు చెప్పగా, కొత్త సుప్రీంను మట్టుబెడతామంటూ ఇజ్రాయెల్ మిలటరీ చేస్తున్న హెచ్చరికలతో చైనా

ఇరాన్ కొత్త సుప్రీం నేతగా నియమితులైన మొజ్తాబా ఖమేనీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ అభినందనలు తెలియజేశారు. ఈ విషయాన్ని క్రెమ్లిన్ వెల్లడించింది. మొజ్తాబా తన తండ్రి అలీ ఖమేనీ వారసత్వాన్ని కొనసాగిస్తూ దేశాన్ని గౌరవప్రదంగా ముందుకు నడిపిస్తారన్న ఆశాభావాన్ని పుతిన్ వ్యక్తం చేశారు. కొత్త నేత ప్రస్తుత సంక్లిష్ట దశలో దేశానికి దిశానిర్దేశం చేస్తూ ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తారని నమ్ముతున్నట్టు పేర్కొన్నారు.




# సిఐఎస్ఎఫ్ సిబ్బంది కార్యదక్షత ప్రశంసనీయం !

## (10 మార్చి "సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం" సందర్భంగా)

10 మార్చి 1969న "కేంద్రీయ పారిశ్రామిక భద్రత దళం" లేదా "సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)" చట్టం ద్వారా ఏర్పడడంతో ప్రతి ఏట 10 మార్చిన "సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. కేంద్ర ప్రభుత్వ ప్రధాన సంస్థలైన విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, పవర్ ప్లాంట్లు, మెట్రో వర్క్స్, పారిశ్రామిక మౌళిక వనరులు, చమురు రిఫైనరీలు, స్టీల్ల ప్లాంట్లు, తీవ్రవాద అదుపు, సైబర్ భద్రత, అత్యవసర సేవలు, విప్పి భద్రత, ప్రభుత్వ సంస్థలు లాంటి పలు ప్రధాన భద్రతా విధులను నిర్వహిస్తున్న సిఐఎస్ఎఫ్ సేవలు అనిర్వచనీయం. ప్రారంభంలో 2,800 మంది సిబ్బందితో మొదలైన సిఐఎస్ఎఫ్ నేడు 1,48,371 మందితో అమూల్య భద్రత సేవలను విస్తరిస్తున్నారు. సిఐఎస్ఎఫ్ సిబ్బంది అంకితభావం, ధైర్య సాహసాలు, త్యాగాలను సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం వేదికగా గుర్తించడం జరుగుతుంది.

### 57వ సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం :

ప్రభుత్వరంగ సంస్థలతో పాటు ముఖ్య పరిశ్రమలకు నిరంతరం భద్రతను కల్పిస్తున్న సిబ్బంది నిస్వార్థ సేవలను ప్రస్తుతించడం మన కనీస కర్తవ్యం అని సదా భావించాలి. నేడు నిర్వహిస్తున్న 57వ సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం-2026 ఇతివృత్తంగా "తీర ప్రాంత భద్రత, సుసంపన్న భారతం (సెఫ్ కోస్ట్: ప్రాస్పరస్ భారత్)" అనబడే అంశం తీసుకొని ప్రచారం చేయడం జరుగుతుంది.

ఈ సందర్భంగా గుజరాత్, పశ్చిమ బెంగాల్ల నుంచి రెండు జట్లుగా 125 మంది సైక్లిస్టులు 6,553 కిమీ సైకిల్ ర్యాలీని 07 మార్చి నుంచి 31 మార్చి వరకు నిర్వహించి చివరకు కన్యాకుమారి చేరనున్నారు.

సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం వేదికగా వీరులకు సన్మానాలు, అవార్డుల వితరణలు, పెరెడ్లు, ప్రసంగాలు, కార్యశాలలు, అవగాహన కార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. ఇదే వేదికగా యువతను భద్రతా సేవల వైపు ఆకర్షించడంతో పాటు ఆయా రంగాల్లో దాగిన ప్రమాదాలను కూడా అవగాహన చేసుకోవాలని ప్రచారం చేస్తారు. దేశ పౌరులు ఏ బాధ్యతాయుత విధులు నిర్వహించినా వారికి తగిన గుర్తింపుతో పాటు దేశాభివృద్ధి జరుగుతుందని గమనించాలి. సిఐఎస్ఎఫ్ సంస్థ సిబ్బంది సేవలను గుర్తిస్తూ, వారికి మన సంఘీభావాన్ని తెలియజేద్దాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి - అదనపు కలెక్టర్ పాండు.



సంగారెడ్డి, మార్చి 9(నేటి నిజం ప్రతినిధి) ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, సమయపాలన పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (ఇన్చార్జ్) పాండు సూచించారు. అధికారులు హాజరు కాకుండా వారి సహాయకులను పంపిస్తున్న ఘటనలు గమనించామని, ఇకపై అలాంటి పరిస్థితి ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు.

సోమవారం కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 41 పిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖలు పరిశీలించి సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దూర ప్రాంతాల నుంచి ప్రజావాణి కార్యక్రమానికి వస్తారని, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు తగిన పరిష్కార మార్గాలను కూడా చూపించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ఆయా శాఖల అధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హాల్ ప్రారంభం..



అమరావతి, మార్చి 9: నియోజకవర్గం తాడేపల్లి పట్టణంలోని నులకపేటలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సోమవారం ప్రారంభించారు. శ్రీరంగం ఫౌండేషన్ సహకారంతో రూ.65 లక్షల సీఎస్ఆర్ నిధులు వెచ్చించి కమ్యూనిటీ హాల్ ను నిర్మించారు. ముందుగా నులకపేటకు చేరుకున్న మంత్రి లోకేష్కు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి కమ్యూనిటీ హాల్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్ధనలు నిర్వహించారు.

అనంతరం అందరితో కలిసి ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ వ్యవస్థాపకులు పి.చంద్ర కిరణ్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీ దేవి,నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎంటీఎంసీ కమిషనర్ షేక్ అలీమ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ తప్పనిసరి..

## -రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించిన సోమిందేపల్లి పోలీసులు..

అమరావతి, మార్చి 9: జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, డి.ఎస్.పి నరసింగప్ప పర్యవేక్షణలో రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా సోమిందేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో హిందూపురం రోడ్డు పెట్రోల్ బంక్ దగ్గర సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిందేపల్లి ఎస్సై రమేష్ , పోలీసు సిబ్బంది వాహనదారులను ఆపి హెల్మెట్ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు.

ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని వివరించారు. హెల్మెట్ వాడటం ద్వారా ప్రమాదాల సమయంలో ప్రాణాలను రక్షించుకోవచ్చని తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిని హెచ్చరిస్తూ వెంటనే హెల్మెట్ కొనుగోలు చేసి ధరించాలని సూచించారు. ఇకపై హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకొని రూ. 1035 జరిమానా విధించబడుతుందని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే ముఖ్యమని, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్ ధరించాలని పోలీసులు కోరారు.

# పశ్చిమ బెంగాల్లో రాష్ట్రపతికి జరిగిన అవమానాన్నీ, సంతాల్ సంస్కృతి పట్ల అగౌరవాన్నీ ఖండించిన ప్రధాని

న్యూఢిల్లీ, మార్చి 9:పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రాష్ట్రపతిని అగౌరవపరచిన తీరునూ, సంతాల్ సంస్కృతి పట్ల ఆ ప్రభుత్వ చిన్నచూపునూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు.

మునుపెన్నడూ లేని విధంగా జరిగిన ఈ పరిణామం అత్యంత అవమానకరమన్న ప్రధాన మంత్రి.. ప్రజాస్వామ్యాన్ని విశ్వసించేవారిని, గిరిజన వర్గాల సాధికారతను ఆకాంక్షించే వారిని ప్రతి ఒక్కరినీ ఈ సంఘటన తీవ్రంగా మనోవేదనకు గురిచేసిందన్నారు.

స్వయానా గిరిజన తెగ నుంచి వచ్చిన గౌరవ రాష్ట్రపతి వ్యక్తపరిచిన బాధ, వేదన.. దేశ ప్రజల మనస్సులను చింతాక్రాంతం చేశాయని ప్రధానమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

పశ్చిమ బెంగాల్లోని టీఎంసీ ప్రభుత్వం అన్ని హద్దులనూ దాటిందని, రాష్ట్రపతికి జరిగిన ఈ అవమానానికి ఆ ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత వహించాలని శ్రీ మోదీ అన్నారు.

సంతాల్ సంస్కృతి వంటి అత్యంత ప్రాధాన్యమున్న అంశాన్ని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా పరిగణించడం కూడా దురదృష్టకరమని ప్రధాన మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రపతి స్థానం రాజకీయాలకు అతీతమైందన్న ప్రధాన మంత్రి.. ఆ స్థానానికి గల పవిత్రతను గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, టీఎంసీలకు ఇకనైనా సద్బుద్ధి కలుగుతుందని ఆశిస్తున్నట్టు శ్రీ మోదీ పేర్కొన్నారు.

"ఇది అత్యంత అవమానకరం. ఇలాంటి ఘటన గతంలో ఎన్నడూ జరగలేదు. ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే, గిరిజన సాధికారతను ఆకాంక్షించే ప్రతి ఒక్కరూ మనోవేదనకు గురయ్యారు.

స్వయానా గిరిజన తెగ నుంచి వచ్చిన గౌరవ రాష్ట్రపతి వ్యక్తపరిచిన బాధ, వేదన.. దేశ ప్రజల మనస్సులను చింతాక్రాంతం చేశాయి.

పశ్చిమ బెంగాల్లోని టీఎంసీ ప్రభుత్వం స్పష్టంగా అన్ని హదులనూ దాటింది. రాష్ట్రపతికి జరిగిన ఈ అవమానానికి రాష్ట్ర పరిపాలన యంత్రాంగం బాధ్యత వహించాలి.

సంతాల్ సంస్కృతి వంటి అత్యంత ప్రాధాన్యమున్న అంశాన్ని కూడా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇంత చిన్నచూపు చూడడం దురదృష్టకరం.

రాష్ట్రపతి స్థానం రాజకీయాలకు అతీతమైనది. ఆ స్థానానికి గల పవిత్రతను గౌరవించి తీరాలి. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి, టీఎంసీకి సద్బుద్ధి కలుగుతుందని ఆశిస్తున్నాను."

# శారదా పీఠం జగద్గురు ఆలయ సందర్శన..

అమరావతి, మార్చి 9:నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం దేవస్థానంను శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి సోమవారం ఆలయానికి విచ్చేసి శ్రీ స్వామి అమ్మవార్లను సేవించారు. ఉదయం ఆలయం వద్దకు చేరుకున్న పీఠాధిపతి వారికి సంప్రదాయాన్ని అనుసరించి రాజగోపురం వద్ద కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టిబొట్ల భరద్వాజశర్మ, అర్చకస్వాములు, వేదపండితులు, ఆలయ విభాగం అధికారులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతంపలికారు.

అనంతరం వారు శ్రీ స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పూజాదికాలను నిర్వహించారు.

# కోట, బుండి గుండా వెళ్ళే ఢిల్లీ - ముంబయి ఎక్స్ప్రెస్ రహదారితో ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు: ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, మార్చి 9:హడోటీ ప్రాంత అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనున్న కోటా విమానాశ్రయ శంకుస్థాపన కార్యక్రమాన్నుద్దేశించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "రాజస్థాన్ నేడు అపూర్వమైన వేగంతో ముందుకు సాగుతోంది. ఇక్కడ నిర్మించబోతున్న కొత్త విమానాశ్రయం ఈ ప్రాంత ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధికి బలమైన చోదక శక్తిగా నిలవబోతోంది" అని శ్రీ మోదీ అన్నారు.

సభనుద్దేశించి మాట్లాడుతూ.. ఇటీవలి తన అజ్మీర్ పర్యటనను ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు. అక్కడ వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతోపాటు దాదాపు 21,000 మంది యువతకు నియామక పత్రాలను అందించిన విషయాన్ని ప్రస్తావించారు. వారం రోజుల వ్యవధిలోనే ఇలా వరుసగా భారీ కార్యక్రమాల నిర్వహణ.. రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందనేందుకు నిదర్శనమన్నారు. "నేడు రాజస్థాన్ ఎంత వేగంతో ముందుకు సాగుతోందో ఈ కార్యక్రమాలే మనకు చాటిచెబుతున్నాయి" అని ఆయన స్పష్టం చేశారు.

హడోటీ ప్రాంతంలోని కోటా, బుండి, బరాన్, ఝలావర్ ప్రజలకు ఇదొక కొత్త ఆశలు చిగురిస్తున్న రోజు ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. దాదాపు రూ.1,500 కోట్ల వ్యయంతో ఈ ఆధునిక విమానాశ్రయ నిర్మాణం మొదలవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆ ప్రాంత ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ... "రాబోయే రోజుల్లో ఈ ఆధునిక విమానాశ్రయం ఈ ప్రాంత అభివృద్ధిలో నూతన ఉత్తేజాన్ని నింపబోతోంది" అని మోదీ స్పష్టం చేశారు.

2023 నవంబరు నాటి తన చేసిన పర్యటనను ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు. విమానాశ్రయం గురించి అక్కడి ప్రజలకు నాడు ఇచ్చిన హామీ ఈ రోజు నెరవేరుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో విమానం ఎక్కాలంటే జైపూర్ లేదా జోధ్పూర్ వరకు వెళ్లాల్సి వచ్చేదని, ఆ ఇబ్బందులు ఇక తొలగిపోతాయని పేర్కొన్నారు. "ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ప్రయాణాలు సులభతరమవుతాయి. కోటాతో పాటు ఈ ప్రాంతమంతటా వాణిజ్యం శరవేగంగా అభివృద్ధి చెందుతుంది" అని శ్రీ మోదీ ధీమా వ్యక్తం చేశారు.

విద్యకూ, విద్యుత్తుకూ నిలయమైన ఒక విశిష్ట కేంద్రంగా కోటా నగరాన్ని ప్రధానమంత్రి అభివర్ణించారు. అణుశక్తి, బొగ్గు, గ్యాసు, జలవనరుల ద్వారా ఈ ప్రాంతం విద్యుత్తును ఉత్పత్తి చేస్తోందంటూ కొనియాడారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన కోటా డోరియా చీరలు, కోటా స్టోన్.. అలాగే బుండీలోని బాస్మతీ బియ్యం వంటి స్థానిక ఉత్పత్తులకు ఎంతో పేరుందని ప్రశంసించారు. "కోటాలో నిర్మించబోయే ఈ కొత్త విమానాశ్రయం ఈ అవకాశాలను ఎన్నో రెట్లు పెంచేందుకు చోదక శక్తిగా పనిచేస్తుంది" అని ప్రధానమంత్రి మోదీ స్పష్టం చేశారు.

ఈ ప్రాంతంలోని పర్యాటక అవకాశాల గురించి ప్రస్తావిస్తూ.. శ్రీ మధురాధీశ్ జీ, గరాడియా మహదేవ్ వంటి క్షేత్రాల ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని, అలాగే ముకుందరా హిల్స్ వంటి వన్యప్రాణి కేంద్రాల విశిష్టతను ప్రధాన మంత్రి వివరించారు. "ఈ మెరుగైన విమాన సౌకర్యం వల్ల ప్రపంచవ్యాప్త పర్యాటకులు ఇక్కడికి తరలివస్తారు. తద్వారా స్థానిక యువతకు, వ్యాపారులకు, ఇక్కడి ఆర్థిక వ్యవస్థకు ప్రత్యక్షంగా ఎంతో మేలు జరుగుతుంది" అని శ్రీ మోదీ చెప్పారు.

కోటా ప్రాంతంలో సమగ్ర రవాణా విప్లవం గురించి కూడా ప్రధానమంత్రి ప్రస్తావించారు. అమృత భారత్ పథకం కింద రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, ఢిల్లీ - ముంబయి ఎక్స్ప్రెస్ రహదారి వల్ల ప్రయోజనాలను ఆయన వివరించారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధిని ప్రస్తావిస్తూ.. "రైలు, రోడ్డు మార్గాల తర్వాత.. ఇప్పుడు మొదలవుతున్న ఈ విమాన యాన సదుపాయాలు కోటా నగర అభివృద్ధిలో వేగాన్ని మరింత పెంచుతాయి" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ఈ ప్రాంత అభివృద్ధి కోసం కోటా ఎంపీ, లోక్సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా అంకితభావాన్ని ప్రధానమంత్రి ప్రశంసించారు. పార్లమెంటులో ఆయన పాత్రనుద్దేశించి ఒక ఆసక్తికరమైన వ్యాఖ్య చేశారు. "కొన్ని పెద్ద కుటుంబాల నుంచి వచ్చిన అల్లరి విద్యార్థులున్నప్పటికీ.. మొత్తం తరగతిని చక్కగా నిర్వహించే ఒక ఉపాధ్యాయుడిలా ఆయన సభను నడుపుతున్నారు" అని శ్రీ మోదీ చమత్కరించారు.

దేశవ్యాప్తంగా ఉన్న విమానయాన రంగాన్ని విశ్లేషిస్తూ.. 2014లో కేవలం 70 విమానాశ్రయాలే ఉండగా.. నేడు ఆ సంఖ్య 160 దాటిందని ప్రధాన మంత్రి గుర్తుచేశారు. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో నిర్మించిన కొత్త టెర్మినళ్లు, విమానాశ్రయాలను వికేంద్రీకృత అభివృద్ధికి ఉదాహరణలుగా చెప్పారు. "కోటాలో నిర్మిస్తున్న ఈ కొత్త విమానాశ్రయం కూడా అదే రీతిలో ఈ ప్రాంత అభివృద్ధికి నూతన ఉత్తేజాన్ని అందిస్తున్న పూర్తి నమ్మకం నాకుంది" అని శ్రీ మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రసంగాన్ని ముగిస్తూ.. 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వ ప్రాధాన్యాన్ని, వేగవంతమైన పురోగతి దిశగా స్పష్టమైన సంకల్పాన్ని ప్రధానమంత్రి పేర్కొన్నారు. సుసంపన్నమైన, శక్తిమంతమైన రాష్ట్రంగా రాజస్థాన్ నిలవాలని ఆకాంక్షించారు. "అభివృద్ధి చెందిన రాజస్థాన్ కోసం మనం వేస్తున్న ఈ బలమైన పునాది.. వికసిత భారత్ సంకల్పానికి మరింత బలాన్ని చేకూరుస్తుంది" అంటూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

# ప్రజావాణిలో ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన అదనపు పోలీసు అధికారి



సంగారెడ్డి, మార్చి 9 (న్యూస్ సంగారెడ్డి ) ప్రజల సమస్యలకు త్వరిత పరిష్కారం అందించేందుకు ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అదనపు పోలీసు అధికారి రఘునందన్ రావు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఆయన స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను శ్రద్ధగా విన్నారు. సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకొని, ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

స్థానిక పోలీసు స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ఎలాంటి భయాలు లేకుండా ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.

స్వీకరించిన ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక పర్యవేక్షణతో త్వరితగతిన పరిష్కారం చేస్తామని తెలిపారు.

# భారత సెమీ కండక్టర్ మిషన్లో క్రియాశీలకంగా సహకరిస్తున్న ఢిల్లీలోని ప్రముఖ విద్యా సంస్థలు

న్యూఢిల్లీ, మార్చి 9:భారత సెమీ కండక్టర్ మిషన్ (ఐఎస ఎం)లో భాగంగా చిప్స్ టు స్టార్టప్స్ (సీటుఎస్) కార్యక్రమం ద్వారా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, కార్మిక శక్తిని అభివృద్ధి చేయటం, ప్రతిభను పెంపొందించటానికి భారత ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. ఈ క్రమంలో 10 ఏళ్లలో సెమీ కండక్టర్ డిజైన్లో 85,000 మంది ఇంజినీర్లకు శిక్షణనివ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా నాలుగేళ్లలోనే భారత్ గణనీయమైన వృద్ధిని సాధించిందని కేంద్ర రైల్వే, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

సినోప్సిస్, కేడెన్స్, సీమెన్స్, రెనెసాస్, ఆన్సిస్, ఏఎమ్డి వంటి సంస్థలు అందిస్తున్న ప్రపంచ స్థాయి ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ) సాధనాలు దేశవ్యాప్తంగా 315 విద్యా సంస్థలకు అందుబాటులోకి వచ్చాయని శ్రీ అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

ఈ సాధనాల సాయంతో విద్యార్థులు సెమీ కండక్టర్ చిప్ల రూపకల్పనలో ఆచరణాత్మక అనుభవాన్ని పొందుతున్నారు. ఈ చిప్లను మొహాలీలోని సెమీకండక్టర్ లాబొరేటరీ (ఎస్సీఎల్)లో తయారు చేసి, పరీక్షిస్తున్నారు. దీనివల్ల విద్యార్థులకు చిప్ రూపకల్పన నుంచి తయారీ, ప్యాకేజింగ్, టెస్టింగ్ వరకు పూర్తి ప్రక్రియలో ప్రత్యక్ష అనుభవం కలుగుతుంది. ఈ కార్యక్రమం ప్రపంచంలోనే అతిపెద్ద 'ఓపెన్-యాక్సెస్ ఈడీఏ' ప్రోగ్రామ్గా నిలిచింది. చిప్ డిజైన్ శిక్షణకు ఇప్పటివరకు 1.85 కోట్ల గంటలకుపైగా ఈడీఏ టూల్ని వినియోగించగా, ఈ సమయం ఇంకా పెరుగుతూనే ఉంది.

అస్సాం నుంచి గుజరాత్, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలోని విశ్వవిద్యాలయాల విద్యార్థులు సెమీ కండక్టర్ డిజైనింగ్లో క్రియాశీలకంగా పాల్గొంటున్నట్లు ఆయన వెల్లడించారు. సెమీకాన్ 2.0 ద్వారా ఈ కార్యక్రమాన్ని 315 విశ్వవిద్యాలయాల నుంచి 500 విశ్వవిద్యాలయాలకు విస్తరించనున్నారు. దీనిద్వారా దేశవ్యాప్తంగా నైపుణ్యం గల ఇంజనీర్ల పటిష్టమైన పునాదిని ఏర్పాటు చేయనున్నారు.

ప్రపంచ సెమీకండక్టర్ పరిశ్రమ 2 ట్రిలియన్ డాలర్లకు చేరుకోనున్న తరుణంలో దాదాపు 2 మిలియన్ల నైపుణ్యం గల నిపుణుల అవసరం ఉంటుందని, తద్వారా భారతీయ యువతకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని కేంద్రమంత్రి తెలిపారు.

# ‘చిప్స్ టు స్టార్టప్స్’లో విశేష పురోగతి సాధించిన భారత్...
## 85,000 మంది సెమీకండక్టర్ ఇంజినీర్లకు శిక్షణ

న్యూఢిల్లీ, మార్చి 9:ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం)లో భాగమైన ‘చిప్స్ టు స్టార్టప్స్ (అ2ూ)’ కార్యక్రమం కింద.. శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, శ్రామిక శక్తి సన్నద్ధతకు భారత ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. సెమీకండక్టర్ డిజైన్ రంగంలో వదేళ్లలో 85,000 మంది ఇంజినీర్లకు శిక్షణ ఇవ్వాలన్న లక్ష్యాన్ని నాలుగేళ్లలోనే చేరుకుని.. భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని కేంద్ర రైల్వే, సమాచార - ప్రసార, ఎలక్ట్రానిక్స్ - ఐటీ శాఖల మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ తెలిపారు.

దేశవ్యాప్తంగా 315 విద్యా సంస్థలలో సైనోప్సిస్, కేడెన్స్, సీమెన్స్, రెనెసాస్, అన్సిస్, ఏఎండీ వంటి ప్రముఖ సంస్థల సహకారంతో ప్రపంచ స్థాయి ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ సాధనాలను అందుబాటులోకి తెచ్చినట్లు శ్రీ అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ సాధనాల సహాయంతో విద్యార్థులు సెమీకండక్టర్ చిప్‌ల రూపకల్పనలో ప్రత్యక్ష అనుభవాన్ని పొందుతున్నారు. ఈ చిప్‌లను మొహాలీలోని సెమీకండక్టర్ లాబొరేటరీలో తయారు చేసి, పరీక్షిస్తున్నారనీ.. దీనివల్ల డిజైన్ నుంచి ఫ్యాబ్రికేషన్, ప్యాకేజింగ్, టెస్టింగ్ వరకు పూర్తి ప్రక్రియలో విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవం లభిస్తోందని ఆయన వివరించారు. నేడు ప్రపంచంలో అతిపెద్ద ఓపెన్ యాక్సెస్ ఈడీఏ ప్రోగ్రాంగా ఈ కార్యక్రమం నిలిచిందని తెలిపారు. చిప్ డిజైన్ శిక్షణ కోసం ఇప్పటివరకు 1.85 కోట్ల గంటలకు పైగా ఈ ఈడీఏ సాధనాల వినియోగం నమోదైందని, ఇది ఇంకా పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు.

అస్సాం నుంచి గుజరాత్ వరకు, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల విద్యార్థులు నేడు సెమీకండక్టర్ డిజైన్ రంగంలో క్రియాశీలంగా భాగస్వాములవుతున్నారని ఆయన తెలిపారు. భారత సాంకేతిక సమర్థతా, స్వావలంబన దిశగా ఇదొక కీలక మైలురాయి అని శ్రీ అశ్వినీ వైష్ణవ్ వ్యాఖ్యానించారు.

ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ పరిశ్రమకు ఉన్న అవసరాలను వివరిస్తూ.. ప్రస్తుతం ఈ పరిశ్రమ విలువ 800?900 బిలియన్ డాలర్లుగా ఉండగా, భవిష్యత్తులో 2 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని శ్రీ అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ క్రమంలో దాదాపు 20 లక్షల మంది నిపుణుల అవసరం ఏర్పడుతుందనీ, ఇది భారతీయ యువతకు అపారమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని ఆయన వెల్లడించారు.

ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0 కింద ఈ కార్యక్రమాన్ని ప్రస్తుతమున్న 315 విద్యాసంస్థల నుంచి 500 సంస్థలకు విస్తరించనున్నట్లు ఆయన ప్రకటించారు. దేశంలోని ప్రతి రాష్ట్రంలో సెమీకండక్టర్ డిజైన్, ఫ్యాబ్రికేషన్, ప్యాకేజింగ్, టెస్టింగ్ రంగాలలో శిక్షణ పొందిన శక్తిమంతులైన నిపుణులను నిరంతరాయంగా తీర్చిదిద్దడానికి ఇది దోహదపడుతుందన్నారు.

సెమీకండక్టర్ రంగంలో బలమైన, స్వావలంబన కలిగిన వ్యవస్థను నిర్మించేందుకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీ అశ్వినీ వైష్ణవ్ పునరుద్ఘాటించారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0 కింద ప్రతిభావంతులను సిద్ధం చేయడం, మౌలిక సదుపాయాల కల్పన, పరిశ్రమల భాగస్వామ్యం ద్వారా భారత్‌ను ప్రపంచ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

# ఐఐటీ హైదరాబాద్‌లో రెండు రోజుల ఎన్‌హెచ్‌సీఎక్స్
## ఇన్నోవేషన్ మీట్‌కు ముగింపు పలికిన ఎన్‌హెచ్ఏ




న్యూఢిల్లీ, మార్చి 9:ఐఐటీ హైదరాబాద్‌లో నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్ఏ) నిర్వహిస్తున్నఎన్‌హెచ్‌సీఎక్స్ ఇన్నోవేషన్ మీట్ ముగిసింది. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) పరిధిలో పరస్పరం ఆధారపడి పనిచేసే, నియంత్రణలకు అనుగుణంగా ఆరోగ్య పరిష్కారాల స్వీకరణను ముందుకు తీసుకెళ్లేలా నియంత్రణ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, పారిశ్రామిక దిగ్గజాలు, సాంకేతిక ఆవిష్కర్తలు, విద్యాసంస్థలను ఈ కార్యక్రమం ఒక్కచోట చేర్చింది.

2026 మార్చి 6, 7 తేదీల్లో ఈ కార్యక్రమం జరిగింది. 2026 ఫిబ్రవరి 22 నుంచి ఫిబ్రవరి 28 వరకు నిర్వహించిన ఎన్‌హెచ్ సీఎక్స్ హ్యాకథాన్ పోటీల గ్రాండ్ ఫినాలేను కూడా ఈ రెండు రోజుల కార్యక్రమం సూచిస్తుంది. ఇక్కడ విజేతలుగా నిలిచిన బృందాలు తమ పరిష్కారాలను విశిష్ట అతిథుల ముందు ప్రదర్శించారు.

ఏబీడీఎం పరిధిలో పని చేసే మూడు సంస్థల్లో నేషనల్ హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌హెచ్‌సీఎక్స్) ఒకటి. దేశవ్యాప్తంగా ఆరోగ్య బీమా క్లెయిముల ప్రక్రియను సులభతరం చేయడానికి, ప్రామాణికీకరణ కోసం ఇది ఏర్పాటైంది. ఆసుపత్రులు, బీమా సంస్థలు, రోగుల మధ్య క్లెయిముల డేటాను సులభంగా మార్చుకోవడానికి వీలుగా ఏకీకృత డిజిటల్ మౌలిక వసతులను ఈ సంస్థ అందిస్తుంది. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ), జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ (జీఐసీ), నేషనల్ రీసోర్స్ సెంటర్ ఫర్ ఈహెచ్‌ఆర్ స్టాండర్డ్స్ (ఎన్ఆర్‌సీఈఎస్), ఇన్స్యూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఐఐబీ), నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (ఎన్ఏబీహెచ్), ఐఐటీ హైదరాబాద్, గూగుల్, ఇండియా ఇన్సూర్‌టెక్ అసోసియేషన్ (ఐఐఏ), ఎన్ఏటీహెల్త్ సంయుక్తంగా ఈ హ్యాకథాన్ నిర్వహించాయి. క్లెయిముల ప్రక్రియను సులభతరం చేసే దిశగా సహకారాత్మక విధానాన్ని ఇది ప్రతిబింబిస్తుంది.

(ఎడమ నుంచి కుడికి) ఐఐటీ హైదరాబాద్ డీన్ ప్రొఫెసర్ జీ నరహరి శాస్త్రి, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీ సౌరభ్ గౌర్, నేషనల్ హెల్త్ అథారిటీ సీఈవో డాక్టర్ సునీల్ కుమార్ బర్న్వాల్, అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ఆఫ్ ఇండియా (ఏహెచ్‌పీఐ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ గిరిధర్ జ్ఞాని, ఏబీడీఎం జేఎస్, ఎండీ శ్రీ కిరణ్ గోపాల్ వస్కా

ఎన్‌హెచ్‌సీఎక్స్ ఇన్నోవేషన్ మీట్ రెండో రోజు ప్రారంభ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ అథారిటీ సీఈవో డాక్టర్ సునీల్ కుమార్ బర్న్వాల్, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమ కార్యదర్శి శ్రీ సౌరభ్ గౌర్, అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ఆఫ్ ఇండియా (ఏహెచ్‌పీఐ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ గిరిధర్ జ్ఞాని, ఐఐటీ హైదరాబాద్ డీన్ ప్రొఫెసర్ జీ నరహరి శాస్త్రి, ఇతర విశిష్ట అతిథులు, పారిశ్రామిక, విద్యా ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత ఇన్స్యూరెన్స్ రంగంలో ఆరోగ్య క్లెయిములు సంక్లిష్టత అనేది అత్యంత దీర్ఘకాలంగా ఎదురవుతున్న సమస్య అని డాక్టర్ సునీల్ కుమార్ బర్న్వాల్ తన ప్రసంగంలో వివరించారు. అలాగే మిలియన్ల మంది పౌరులను ప్రభావితం చేసే ప్రక్రియకు ప్రామాణీకరణ, పరస్పరం ఆధారపడే విధానాన్ని తీసుకురావడంలో ఎన్‌హెచ్‌సీఎక్స్ పాత్రను వివరించారు.

“ఆసుపత్రులు, బీమా సంస్థలకు మాత్రమే నేషనల్ హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజ్ పరిమితం కాలేదు. ఇది రోగులు, ఆరోగ్య సేవలు అందించేవారు, బీమా సంస్థలు, సాంకేతిక ఆవిష్కర్తలతో సహా మొత్తం వ్యవస్థకు సేవలు అందించేందుకు రూపొందించిన వ్యవస్థ. యూపీఐ లాంటి డిజిటల్ మౌలిక వసతుల మాదిరిగానే ఎన్‌హెచ్‌సీఎక్స్‌కు దీర్ఘకాలిక లక్ష్యం కూడా ఉంది. వ్యవస్థను ఏ సంస్థ నిర్వహిస్తుందో తెలియనప్పటికీ అది సజావుగా, నమ్మకమైన సేవలు అందిస్తే ప్రజలు ఆ వేదికను విశ్వసిస్తారు.”

డాక్టర్ సునీల్ కుమార్ బర్న్వాల్, సీఈవో, నేషనల్ హెల్త్ అథారిటీ

విస్తృత స్థాయిలో అందించే నాణ్యమైన సేవలను మెరుగుపరిచేందుకు డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధ, డేటా ఆధారిత వ్యవస్థలే కేంద్రంగా ఉన్నాయనే ఏకాభిప్రాయం విశిష్ట అతిథుల ప్రారంభోపన్యాసాల్లో వ్యక్తమయింది.

“డిజిటల్ మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాథమిక బ్లాకులను నిర్మించే శక్తిని ఆంధ్రప్రదేశ్‌లో మేం బలంగా విశ్వసిస్తున్నాం. రాష్ట్రంలో జనాభా అంతటికీ ఏబీహెచ్ఏ సంఖ్యలను రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తోంది. అలాగే దీనికి అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఇది డిజిటల్ ప్రజా మౌలిక వసతులను బలోపేతం చేయడంలోనూ, డిజిటల్ ఆరోగ్య రంగంలో ప్రతి పౌరుడికీ భాగస్వామ్యం అందించడంలోనూ మా అంకిత భావాన్ని ప్రతిబింబిస్తుంది.”

శ్రీ సౌరభ్ గౌర్, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి

పోటీలకు సమర్పించిన 110 పరిష్కారాలను ఐఐటీ హైదరాబాద్, ఎన్ఆర్‌సీఈఎస్, జీఐసీ, గూగుల్, ఐఐఏ, ఎన్ఏటీహెల్త్, ఎన్‌హెచ్ఏ ప్రతినిధులతో కూడిన స్వతంత్ర నిపుణుల జ్యూరీ మూల్యాంకనం చేసింది. ఆరోగ్య బీమా క్లెయిములకు సంబంధించిన కీలకమైన సమస్యలను పరిష్కరించే వినూత్న ఆవిష్కరణలను గుర్తిస్తూ హ్యాకథాన్ విజేతలను సత్కరించారు.

దేశవ్యాప్తంగా ఏబీడీఎంను స్వీకరించేందుకు సహకారాన్ని బలోపేతం చేయడం, భాగస్వాములు చేసిన కృషిని గుర్తించడమే లక్ష్యంగా మూడు భాగస్వామ్యాలను ఎన్‌హెచ్ఏ ఈ సందర్భంగా ప్రారంభించింది. చెల్లింపులు, సేవల వ్యవస్థ అంతటా ఎన్‌హెచ్‌సీఎక్స్‌ను అమలు చేయడంలోనూ, విస్తరించడంలోనూ తమ వంతు పాత్రను అంకితభావంతో పోషించిన సంస్థలను ఎన్‌హెచ్‌సీఎక్స్ ఛాంపియన్స్ గుర్తిస్తుంది. ప్రభుత్వ మార్గాల ద్వారా మాత్రమే కాకుండా, తమ పరిధిలో ఏబీడీఎంపై అవగాహన పెంచిన సంస్థలు, నైపుణ్య విభాగాలను ఏబీడీఎం అంబాసిడర్స్ గుర్తిస్తుంది. ఎన్‌హెచ్‌సీఎక్స్ ద్వారా సమర్పించిన పీఎం-జేఏవై క్లెయిములను అందించేందుకు విజయవంతమైన మాడ్యూళ్లను తయారు చేసిన సంస్థలను ఎన్‌హెచ్‌సీఎక్స్-పీఎంజేఏవై ఎర్లీ ఇంటిగ్రేటర్స్ సత్కరిస్తుంది. తద్వారా ప్రామాణికమైన, పరస్పర ఆధారిత క్లెయిమ్స్ ఎక్స్ఛేంజ్ పరిధిలోకి ప్రభుత్వం నిధులు అందిస్తున్న, ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య భరోసా పథకాన్ని తీసుకువస్తుంది. ఈ మూడు కార్యక్రమాల పరిధిలో మొదటి విడత పురస్కార గ్రహీతలను ఇన్నోవేషన్ మీట్‌లో ప్రకటించారు.

ప్రభుత్వం, నియంత్రణ, పారిశ్రామిక, సాంకేతిక రంగాలకు చెందిన వారిని ఒకే వేదిక మీదకు తీసుకొచ్చే ప్యానెల్ చర్చలు ఇన్నోవేషన్ మీట్‌లో జరిగాయి. క్లెయిముల సవాళ్లకు సంబంధించి సాంకేతిక, కార్యాచరణ కోణాలపై మొదటి రోజు చర్చలు జరిగాయి. క్లెయిము సెటిల్మెంట్లకు ప్రామాణీకరణ, ఏఐ, సాంకేతికత ద్వారా ఆరోగ్య బీమా వ్యవస్థ రూపాంతరం లాంటి అంశాలపై చర్చించారు. రెండో రోజు విస్తరణ, స్వీకరణపై రెండో రోజు దృష్టి సారించారు. అలాగే క్లెయిముల ప్రక్రియ భవిష్యత్తు, ఎన్‌హెచ్‌సీఎక్స్‌ను ఆసుపత్రులు స్వీకరించడంలో ఎదురయ్యే నిర్దిష్ట అడ్డంకులు, ప్రోత్సాహకాలను పరిశీలించారు.

రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎన్‌హెచ్ఏ జాయింట్ సెక్రటరీ, మిషన్ డైరెక్టర్(ఏబీడీఎం) శ్రీ కిరణ్ గోపాల్ వస్కా ముగించారు. ఈ రెండు రోజుల్లో నిర్వహించిన చర్చల సారాంశాన్ని ఆయన సమర్పించారు. అనంతరం ఐఆర్‌డీఏఐ ఛైర్మన్ శ్రీ అజయ్ సేథ్ ముగింపు ఉపన్యాసం చేశారు. ఆరోగ్య వ్యవస్థ ఆధారిత ఆవిష్కరణలు, అత్యున్నత స్థాయి విధాన చర్చలు, క్షేత్రస్థాయిలో ఎన్‌హెచ్‌సీఎక్స్ స్వీకరణను ప్రోత్సహించే సంస్థలకు గుర్తింపు మేలు కలయికతో ఇన్నోవేషన్ మీట్ జరిగింది. ఇది భారత్‌లో డిజిటల్ ప్రాధాన్యమైన, పరస్పర ఆధారిత ఆరోగ్య క్లెయిముల వ్యవస్థకు గణనీయమైన వేగాన్ని అందిస్తుందని అంచనా వేస్తున్నారు.

# వైసీపీ పాలనలో అభివృద్ధి అస్తవ్యస్తం..

**-చివరి రోజుల్లో వీధి పేర్ల రాజకీయాలు..**

**-కార్పొరేషన్‌లో పెండింగ్ పనులపై ఒక్కసారిగా హడావుడి..**

**-తెలుగుదేశం పార్టీ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి..**

అమరావతి, మార్చి 9:వైసీపీ పాలనలో గత ఐదు సంవత్సరాలుగా విజయవాడ నగరం అభివృద్ధి లేకుండా ఎంతో నష్టపోయిందని తెలుగుదేశం పార్టీ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి తీవ్ర విమర్శలు చేశారు. నగరంలోని ఆటో నగర్ లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ మేయర్ ఆధ్వర్యంలో నగరానికి ఉపయోగపడే ముఖ్యమైన అభివృద్ధి పనులు జరగలేదని ఆరోపించారు. కార్పొరేషన్‌లో ప్రతి నెల నిర్వహించాల్సిన కౌన్సిల్ సమావేశాలను సక్రమంగా నిర్వహించకుండా మూడు నాలుగు నెలలకు ఒకసారి నిర్వహించడం వల్ల అనేక పనులు పెండింగ్‌లో పడిపోయాయని పేర్కొన్నారు.

ఐదు సంవత్సరాలుగా ప్రజా సమస్యలను పట్టించుకోని వైసీపీ కార్పొరేటర్లు ఇప్పుడు ఒక్కసారిగా పెండింగ్ పనుల పేరుతో ఎజెండాలో ప్రతిపాదనలు పెట్టడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమని విమర్శించారు. రాబోయే 11వ తేదీన జరిగే కౌన్సిల్ సమావేశం కోసం రూపొందించిన ఎజెండాను పరిశీలిస్తే నగర అభివృద్ధి అంశాల కంటే వీధుల పేర్లు పెట్టే ప్రతిపాదనలే ఎక్కువగా ఉన్నాయని అన్నారు. నగర అభివృద్ధిపై చూపాల్సిన చిత్తశుద్ధి లేకపోయినా వీధి పేర్ల రాజకీయాలపై ఆసక్తి చూపడం వైసీపీ పాలన వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే విజయవాడ అభివృద్ధికి ఊతం లభించిందని బాలస్వామి తెలిపా రు. సెంట్రల్, తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో కలిపి రూ.10 41 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యేలతో పాటు ఎంపీ కేసినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో నగరంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ కార్యక్రమాలు కూడా అమలవుతున్నాయని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మూడు గ్యాస్ సిలిండర్ల పథకం, విద్యార్థులకు సౌకర్యాల కల్పన, పెన్షన్ మొత్తాన్ని రూ.3000 నుంచి రూ.4000కు పెంపు వంటి నిర్ణయాలు ప్రజలకు ప్రయోజనం చేకూర్చాయని అన్నారు. వైసీపీ పాలనలో అవినీతి, దుర్వినియోగం పెరిగాయని ప్రజలు గ్రహించారని, అందుకే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీని తీవ్రంగా తిరస్కరించారని చెప్పారు. రాష్ట్రంలో ఆ పార్టీ కేవలం కొద్ది స్థానాలకు మాత్రమే పరిమితమైందని విమర్శించారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా ప్రజలు అదే తీర్పును ఇవ్వబోతున్నారని బాలస్వామి అన్నారు.

విజయవాడ నగరంలో 64 కార్పొరేషన్ సీట్లలో వైసీపీకి కొన్ని సీట్లు కూడా దక్కని పరిస్థితి ఉందని, కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. రేపు జరిగే కౌన్సిల్ సమావేశంలో కమిషన్ల కోసం తీసుకువచ్చిన ప్రతిపాదనలు, వీధి పేర్ల రాజకీయాలను టిడిపి కార్పొరేటర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తారని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ గత ఐదు సంవత్సరాలుగా నిరంతరం పోరాటం కొనసాగించామని పేర్కొన్నారు. విజయవాడ అభివృద్ధి కోసం తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్ రావు, సుజనా చౌదరి, ఎంపీ కేసినేని శివనాథ్ (చిన్ని)తో పాటు పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడ నగరం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

# మధ్యాహ్న భోజన నాణ్యతపై కలెక్టర్ ఆగ్రహం..

**-ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీస్ జారీ,**

**-జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

నాగర్ కర్నూల్,మార్చి 9: నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, మెనూ అమలు విధానంపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ మధ్యాహ్న భోజన మార్గదర్శకాల ప్రకారం మెనూలో భాగంగా విద్యార్థులకు కిచిడీ, గుడ్డు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ ఇవ్వాల్సి ఉంది. అయితే పాఠశాలలో ఈరోజు మాత్రం విద్యార్థులకు వైట్ రైస్, గుడ్డు, సాంబార్ మాత్రమే వడ్డిస్తున్నట్లు కలెక్టర్ గమనించారు. నిర్ణయించిన కామన్ డైట్ మెనూను ఎందుకు పాటించలేదని పాఠశాల సిబ్బందిని కలెక్టర్ ప్రశ్నించారు.

అదేవిధంగా విద్యార్థులకు వడ్డించిన అన్నం, సాంబార్ నాణ్యత సరిగా లేకపోవడంతో కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అన్నం సరిగా వండకపోవడం, సాంబార్ పసుపు నీళ్ల లాగా నాణ్యత కూడా బాగోలేదని గుర్తించిన కలెక్టర్ పాఠశాల హెడ్‌మాస్టర్ భాస్కర్ రెడ్డి మరియు వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజూ పిల్లలకు ఇలాగే భోజనం పెడుతున్నారా.. అన్నం ఎలా ఉంటుందో కూడా తెలియదా.. అంటూ ఉపాధ్యాయులను కలెక్టర్ మందలించారు. జిల్లాలోని తను అనేక పాఠశాలల్లో తాను మధ్యాహ్న భోజనం చేసి పరిశీలించినప్పటికీ, ఇంత నాసిరకం భోజనం ఎక్కడా తినలేదని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కానీ ఇలాంటి నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఎందుకు మిమ్మల్ని విధుల నుండి సస్పెండ్ చేయరాదని కలెక్టర్ ప్రధానోపాధ్యాయుడిని, ఉపాధ్యాయురాలని ప్రశ్నించారు.

విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందేలా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. రోజువారీ కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా పాటించాలని, మధ్యాహ్న భోజన వంట ప్రక్రియను ప్రతిరోజూ పర్యవేక్షించాలని హెడ్‌మాస్టర్‌కు ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు పాఠశాల హెడ్‌మాస్టర్ భాస్కర్ రెడ్డి మరియు ఫుడ్ చెకింగ్ టీచర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ కు ఫోన్ ద్వారా కలెక్టర్ ఆదేశించారు. ఇద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని కచ్చితంగా అమలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన మరియు పౌష్టికాహారం అందేలా అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.

విద్యార్థుల ఆరోగ్యం మరియు విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా అమలయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. అంతకుముందు 10వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ...., పదవ తరగతి పరీక్షలకు కేవలం నాలుగు రోజుల సమయం మాత్రమే ఉందని ఈ నెల రోజులు సమయాన్ని వృధా చేయకుండా ప్రతి పరీక్షకు భయం లేకుండా హాజరై మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధించాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో 100 % ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థులపై కలెక్టర్ ఆరా తీశారు.

ఈ విద్యా సంవత్సరం 128 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వివరించారు. పదో తరగతి విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన ప్రీ ఫైనల్ పరీక్షల మార్కులను ఇప్పటివరకు ఎందుకు అందించలేదని కలెక్టర్ ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ బాదాం రమేష్, నాగర్ కర్నూల్ ఆర్డిఓ సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, వార్డు కౌన్సిలర్ నిజాముద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

# పశ్చిమాసియాలో పరిణామాలు
## ఆందోళనకరం: కేంద్ర మంత్రి జయశంకర్

న్యూఢిల్లీ, మార్చి 9:పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జయశంకర్ అన్నారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు జరుపుతున్న దాడి అంశంపై ఆయన ఇవాళ రాజ్యసభలో మాట్లాడారు. ఎటువంటి సమస్యనైనా పరిష్కరించేందుకు చర్చలు, సంప్రదింపులు నిర్వహించాలని తాము విశ్వసిస్తామని, పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాలను ప్రధాని మోదీ నిశితంగా పరిశీలిస్తున్నారని మంత్రి జయశంకర్ అన్నారు. సంక్షోభం మొదలైన నాటి నుంచి పశ్చిమాసియాలో ఉన్న ఉద్రిక్త పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని, ఆయా దేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని వెనక్కి తీసుకువచ్చేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆయన చెప్పారు. ఇరాన్‌లో వేలాది మంది భారతీయులు ఉన్నారని, కొందరు చదువు కోసం వెళ్లగా, మరికొం దరు ఉద్యోగం కోసం వెళ్లినట్లు తెలిపారు. మన దేశ ఇంధన భద్రతకు ఆ ప్రాంతం చాలా కీలకమైందని, ఆయిల్.. గ్యాస్ సరఫరా చేస్తున్న కంపెనీలు ఉన్నాయన్నారు. ఇరాన్‌కు అత్యవస రం కానటువంటి పర్యటన చే యవ ద్దు అని భారతీయులకు సల హా ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు. ఇరాన్ నాయకులతో గతంలో సంప్రదించామని, కానీ ఈ దశలో చాలా కష్టంగా ఉన్నట్లు మంత్రి చెప్పారు.

# అంగన్ వాడి పిల్లలకు విద్య సామగ్రి పంపిణీ...



ఆదిలాబాద్, మార్చి 9:కమ్మర్ పల్లి మండలం ఉప్లూర్ గ్రామం లోని సురేష్ నగర్ లో గల అంగన్ వాడి కేంద్రంలో ఉపసర్పంచ్ తక్కురి ముత్యం శేఖర్ చేతుల మీదుగా చౌట్ పల్లి ఎస్బిఐ బ్యాంక్ వారు అందచేసిన విద్య సామగ్రి బ్యాగ్, పలకలు, పుస్తకాలు, పెన్సిల్, స్టీల్ ప్లేట్స్, వాటర్ బాటిల్సను సోమవారం పిల్లలకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఉపసర్పంచ్ తక్కురి ముత్యం మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన విద్యను, పౌష్టిక ఆహారం అందించి పిల్లలను, గర్భిణీలను ఆరోగ్యవంతంగా చూసుకోవసిన గురుతర బాధ్యత అంగన్ వాడి టీచర్లదే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి సూపర్వైజర్ గంగ హంస, వార్డ్ సభ్యులు సాదుల్లా, న్యాయవాది సుంకరి విజయ్ కుమార్, నరేష్, అనిల్, ఏఎన్ఎం అరుణ, అంగన్ వాడి టీచర్లుపద్మ, శోభ, సరిత, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్టు

## -బంగారం, వెండి, నగదు స్వాధీనం
## -వివరాలు వెల్లడించిన ఏలూరు ఎస్పీ

ఏలూరు, మార్చి 9: ఆ ఇద్దరి దొంగలకు తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యం. ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకొని దొంగ లక్ష్యంగా చేసుకొని దొంగత నాలు చేయడం ప్రారంభించారు. ఇంటి తాళాలు పగలు కొట్టి ఇంటిలోఉన్న బంగారం, వెండి,






తనాలకు పాల్పడుతుంటారు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన ఈ ఇద్దరు ఇంటి తాళాలు పగుల కొట్టి బంగారం, వెండి, డబ్బులు విలువైన వస్తువులను దోచుకెళుంటారు. సుమారు ఏడాది కాలంగా దొంగతనాలకు పాల్పడు తూ జల్సాలు చేస్తున్నారు. చివరికి పోలీసులకు చిక్కారు. వివరాల్లోకి వెళ్తే..

ముదినేపల్లి, కలిదిండి, మండవల్లి, బంటుమిల్లి, పెడన, మొగల్తూరు మరికొన్ని మండలాల్లో తాళాలు వేసిన ఇళ్లను డబ్బులు, విలువైన వస్తువులు దొంగతనాలకు, నేరాలకు పాల్పడ్డారు. ఏలూరు జిల్లా సూపరింటెండెంట్ ప్రతాప్ శివ కిశోర్, ఆదేశాల మేరకు, ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో, కైకలూరు రూరల్ సీఐ. వి.రవి కుమార్ ఆధ్వర్యంలో ముదినేపల్లి పోలీస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని, స్థానిక సమాచా రాన్ని విశ్లేషించి నిందితులను గుర్తించారు. సోమవారం ముదినేపల్లి వద్ద వీరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి చోరీ చేసిన బంగారం, వెండి ఆభరణా లను, విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీరు ఏలూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి మూడు జిల్లాలలో నేరాలకు పాల్పడినట్లు విచారణ లో తేలింది. సుమారు 200 గ్రాములు, ( 25 కాసులు), వెండి వస్తువులు సుమారు 3 కేజీలు, టీవీలు మూడు, గ్యాస్ సిలిండర్స్ 3 మోటార్ సైకిల్ 3 రికవరీ చేయగా రికవరీ చేసిన సొత్తు విలువ 45 లక్షల రూపాయలు ఉంటుందని పోలీసు లు అధికా రులు తెలిపారు.

ఈ కేసులు ఛేదనలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారు లు, సిబ్బంది వి.రవి కుమార్, సీఐ కైకలూరు రూరల్ సర్కిల్ వి.ఎస్.వి.భద్రరావు, ఎస్.ఐ. ముదినేపల్లి, వి.వెంకటేశ్వర రావు, ఎస్.ఐ. కలిదిండి, కానిస్టేబుల్ బి. నాగబాబు, పీ.నాగ రాజు, పీ. పవన్ కుమార్, జీ.శివ కోటయ్య, పీ.వి. సత్యనారాయణ (డి.ఎన్.బి., సెల్ ట్రాక్, ఏలూరు)లను ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ అభినందించారు.

# భారత్‌లో హరిత హైడ్రోజన్ ఉత్పాదనల వాణిజ్యాన్ని పెంచేందుకు

## గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మెథనాల్ ప్రమాణాలను ప్రకటించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, మార్చి 9:జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ పురోగతికి ముఖ్యమైన చర్యగా భారత్‌లో గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మెథనాల్ ప్రమాణాలను 2026 ఫిబ్రవరి 27న ప్రభుత్వం నోటిఫై చేసింది. పునరుత్పాదక వనరుల నుంచి ఉత్పన్నమైన హరిత హైడ్రోజన్ నుంచి ఉత్పత్తి చేసిన అమ్మోనియా, మెథనాల్‌ను 'హరితం'గా వర్గీకరించడానికి పాటించాల్సిన ఉద్గార పరిమితులు, అర్హతల షరతులను నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఈ) జారీ చేసిన ఈ ప్రమాణాలు వివరిస్తాయి.

భారత్‌లో గ్రీన్ అమ్మోనియా ప్రమాణం- గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, అమ్మోనియా సంశ్లేషణ, శుద్ధి, సంపీడనం, ఆన్-సైట్ నిల్వ నుంచి వెలువడే జీవ సంబంధితం కాని గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల మొత్తంలో కేజీ అమ్మోనియాకు 0.38కేజీలకు మించకుండా కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రీన్ అమ్మోనియా కలిగి ఉండాలి. దీనిని 12 నెలల కాల వ్యవధికి సగటును లెక్కిస్తారు.

భారత్‌లో గ్రీన్ మెథనాల్ ప్రమాణం- గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, అమ్మోనియా సంశ్లేషణ, శుద్ధి, సంపీడనం, ఆన్-సైట్ నిల్వ నుంచి వెలువడే జీవ సంబంధితం కాని గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల మొత్తంలో కేజీ మెథనాల్‌కు 0.44 కేజీలకు మించకుండా కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రీన్ మెథనాల్ కలిగి ఉండాలి. దీనికి 12 నెలల కాల వ్యవధికి సగటును లెక్కిస్తారు.

మెథనాల్ ఉత్పత్తికి అవసరమైన కార్బన్ డై ఆక్సైడ్‌ను బయోజెనిక్ వనరులైన డైరెక్ట్ ఎయిర్ క్యాప్చర్ (డీఏసీ) లేదా ఇప్పటికే ఉన్న పారిశ్రామిక వనరుల నుంచి స్వీకరించవచ్చని ఈ నోటిఫికేషన్ పేర్కొంటుంది. కార్బన్ డై ఆక్సైడ్ కోసం అర్హత కలిగిన వనరులను మంత్రిత్వ శాఖ కాలానుగుణంగా సవరించవచ్చు. తగిన నిబంధనలతో వర్తించేలా రాబోయే రోజుల్లో అమల్లోకి వస్తాయి.

గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మెథనాల్ ఉత్పత్తి ప్రక్రియలో పునరుత్పాదక వనరుల నుంచి ఉత్పత్తి అయి ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థలో నిల్వ చేసిన లేదా వర్తించే నిబంధనలకు అనుగుణంగా గ్రిడ్‌కు అనుసంధానించిన పునరుత్పాదక విద్యుత్ కూడా ఉంటుంది.

గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ ఇథనాల్ కొలత, నివేదిక, పర్యవేక్షణ, ఆన్-సైట్ తనిఖీ, ధ్రువీకరణకు సంబంధించిన వివరణాత్మక పద్ధతులను నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ వేర్వేరుగా జారి చేస్తుందని ఈ ప్రకటన స్పష్టం చేసింది.

నోటిఫికేషన్లు జారీ అయిన తేదీ కంటే ముందే జారీ అయిన ఏదైనా టెండరు, బిడ్ ప్రక్రియ లేదా ఆహ్వాన సమయంలో వర్తించే నిబంధనలు, షరతుల ప్రకారం కొనసాగించవచ్చు. అయినప్పటికీ, ఇలాంటి టెండర్‌ను సాధ్యమైతే పార్టీల పరస్పర అంగీకారంతో నోటిఫికేషన్ నిబంధనలకు అనుగుణంగా సేకరణ సంస్థ చేపట్టవచ్చు.

గ్రీన్ హైడ్రోజన్ ఉత్పాదనల అభివృద్ధిలో నిమగ్నమైన పరిశ్రమలు, పెట్టుబడిదారులు, ఇతర భాగస్వాములకు గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మెథనాల్ ప్రమాణాల నోటిఫికేషన్లు స్పష్టతనిస్తాయి.

ఎరువులు, రవాణా, విద్యుత్, భారీ పరిశ్రమ తదితర రంగాల డీకార్బనైజేషన్‌ను ఈ ప్రమాణాలు సులభతరం చేస్తాయి. అదే సమయంలో హరిత ఇంధనాలకు నమ్మకమైన ఉత్పత్తిదారుగా, ఎగుమతిదారుగా భారత్ స్థానాన్ని బలోపేతం చేస్తాయి.

గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మెథనాల్ ఎగుమతుల మార్కెట్లను భారతీయ గ్రీన్ హైడ్రోజన్ అభివృద్ధిదారులు లక్ష్యంగా చేసుకుంటున్నారు.

జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ పరిధిలో గ్రీన్ హైడ్రోజన్, దాని ఉత్పన్నాల విషయంలో నియంత్రణలను ఈ నోటిఫికేషన్‌తో మరింత పటిష్టంగా మారతాయి.

# బీజేపీతోనే నగరాభివృద్ధి..

## వరంగల్ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక నజర్
## వరంగల్ కు భారీగా నిధులు కేటాయిస్తున్న ప్రధాని.
## అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కి నిధులు కేటాయించడం అభినందనీయం.
## బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్.
## వరంగల్ మునిసిపల్ కార్యాలయం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం.




వరంగల్, మార్చి9:గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ భారీగా నిధులు కేటాయిస్తున్నారని మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. కేంద్ర పథకం అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పథకానికి నిధుల సమీకరణ లో భాగంగా విదేశీ సహాయం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో కలిసి కేంద్రం నిధుల్ని సమీకరించడం తో గంట రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం గ్రేటర్ మున్సిపల్ కార్యాలయం వద్ద క్షీరాభిషేకం చేశారు. అనంతరం గంట రవికుమార్ మాట్లాడుతూ ఈ పథకం కింద 5257.20 కోట్లతో చేపట్టే పనులకు పాలనా పరమైన అనుమతి మంజూరు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు. కేంద్రం భారీగా నిధులు ఇస్తున్న ఖర్చు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలం అవుతున్నారని పేర్కొన్నారు.

గ్రేటర్ వరంగల్ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని గంట రవికుమార్ అన్నారు. ఇప్పటికే ఎయిర్పోర్టు మంజూరు చేసిన కేంద్రం తాజాగా అండర్ డ్రైనేజీకి నిధులు మంజూరు చేసిందని.. ఇప్పటికే స్మార్ట్ సిటీ లో భాగంగా అనేక నిధులు ఇచ్చి నగరం రూపురేఖలు మార్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో హామీలు తప్ప అభివృద్ధి చేసింది లేదని విమర్శించారు. ఓట్ల కోసం ఇచ్చే హామీలు తప్ప ప్రజల బాగోగులు పట్టించుకున్న దాఖలు లేవని దుయ్యబట్టారు. కేంద్రం నిధులు ఇస్తున్న.. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. బండ్ పనుల్లో ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. గ్రేటర్ వరంగల్ ఇప్పటివరకు అభివృద్ధి చెందిందంటే అది కేవలం కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అని స్పష్టం చేశారు. వరంగల్లో బిజెపి ఎమ్మెల్యే కానీ ఎంపీ అభ్యర్థి లేకపోయినా కూడా కేంద్రం నిధులు ఇస్తుందని.. అదే అధికారంలో ఉంటే ఇంకేం నిధులు వస్తాయని గంట రవికుమార్ అన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, ప్రత్యేక వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, బిజెపి కార్పొరేటర్ గందె కల్పనా నవీన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, బైరి నాగరాజు, పదాధికారులు, వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, బిజెపి నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు కళ్లల్లో ఆనందం చూడటమే ధ్యేయం..

## -మీ భూమి మీ హక్కు బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
## -అన్నదమ్ములు ఘర్షణలు వదు

నంద్యాల,మార్చి 9: ప్రతి రైతు కళ్ళల్లో ఆనందం కోసమే ఈ ఉమ్మడి కూటమి ప్రభుత్వమే పనిచేస్తుందని ఏ రైతు కూడా టిడిపి ప్రభుత్వంలో బాధ పడకూడదని వారి కోసమే ఈ ప్రభుత్వం 24 గంటలు పని చేస్తుందని అధికారులు అప్రమత్తంగా ఉండి పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీలో ఏమాత్రం అవకతవకలు జరిగిన సహించని అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు.

నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్తబురుజు గ్రామంలో "మీ భూమి - మీ హక్కు" కార్యక్రమం ద్వారా సోమవారం పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్తపురుజు గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి రైతు తమ సమస్యలను బాధలు చెప్పుకున్నారు. జిల్లాలోని ప్రతి రైతు సమస్యలు ఉన్న రైతుకు మైకును ఇచ్చి వారి సమస్యలను చెప్పమన్నారు.

రైతు సమస్యలను వివరంగా చెప్పుకున్నారు. ఇనామ్ భూముల వ్యవహారంపై రెవిన్యూ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికిన జిల్లా జిల్లా ఇంచార్జి మంత్రి పయ్యావుల కేశవ్, రెవెన్యూ శాఖ మంత్రి సి.అనగాని సత్యప్రసాద్, జిల్లా మంత్రులు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి.జనార్ధన్ రెడ్డి, డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య, శ్రీశైలం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి, పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితరెడ్డి, భూవ్యవస్థాపన శాఖ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ మరియు స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి, అదనపు చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జె.వెంకట మురళి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, కొత్తబురుజు గ్రామ సర్పంచ్ ప్రమీల, ప్రజా ప్రతినిధులు తదితరులు స్వాగతం పలికారు.

తదుపరి కొత్తబురుజు గ్రామంలో నిర్వహిస్తున్న "మీ భూమి - మీ హక్కు" కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. రైతులకు భూములపై హక్కులను బలపరచడం, భూ రికార్డులను పారదర్శకంగా చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న రు. డోన్ మండలం కొత్తబురుజు గ్రామ సభా వేదిక వద్ద జిల్లాకు సంబంధించిన మైనింగ్, భూగర్భ జలాలు, వాటర్ షేడ్స్, పర్యాటకం, ఉద్యాన, ఆర్ అండ్ బీ శాఖ స్టాల్స్ పరిశీలించి అధికారుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్న రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నా యుడు. వాటి వివరాలను ప్రజలకు సవివరంగా అందజేయాలని సూచించారు.

నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గం, కొత్తబురుజులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన సైడ్ లైట్స్

రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.



సభా ప్రాంగణంలో ఏర్పాటు హార్టికల్చర్ పంటల ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించిన సీఎం

ఫ్రూట్ కవర్ల వల్ల పండ్లకు మంచి ధర వచ్చిందని తెలిపిన హార్టికల్చర్ అధికారులు..

పండ్లకు కవర్ల తొడుగుపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని సీఎం ఆదేశం.

కవర్ కట్టిన పండ్ల నాణ్యత.. కవర్ లేని పండ్ల నాణ్యతను పరిశీలించిన ముఖ్యమంత్రి.

జిల్లాలో మంచి రేట్ వచ్చే వివిధ వెరైటీల ఉత్పత్తులను ప్రోత్సహించాలని సీఎం సూచన.

జిల్లాలో భూగర్భ జలాల పెరిగేలా నీటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం సూచనను అధికారులు పాటించాలని ఆదేశాలు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన సర్పంచ్..

చిట్యాల, మార్చి 9: ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థి కాటం వెంకటేశం ను గెలిపిస్తే గ్రామంలో ఆడబిడ్డ పెళ్లి అయితే పదివేల 16 రూపాయలు అందిస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో శ్రీ శ్రీ శ్రీ తిరుమల నాద దేవస్థానం చైర్మన్ ఓర్సు రాజు ప్రకటించడం జరిగింది, అందులో భాగంగా నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ వర్గం చిట్యాల మండలం పెద్ద కాపర్తి గ్రామం లో సోమవారం నాడు గ్రామానికి చెందిన నూతి శ్రీను కుమార్తె జ్ఞానేశ్వరి వివాహం జరిగింది నూతన దంపతులకు చైర్మన్ పంపిన పదివేల 16 రూపాయల ను మండల సర్పంచ్ల ఫోరం గ్రామ సర్పంచ్ కాటం వెంకటేశం అందజేశారు.

# రైతులకు పారదర్శకంగా సేవలు అందించాలి : స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి



మెదక్, మార్చి 9:దేశానికి వెన్నుముక రైతన్నకు పారదర్శకంగా సేవలు అందించాలని స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి అధికారులకు సూచించారు. హవేలీ ఘనపూర్ మండలంలో ఆమె ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు , ఇతర వ్యవసాయ అవసరాలు సమయానికి అందుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.

కేంద్రంలోని రికార్డులు, స్టాక్, సరుకు నిల్వల వివరాలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సామగ్రి సరిపడా నిల్వ ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో స్థానిక ఎంఆర్వో సింధు రేణుక , మండల వ్యవసాయ అధికారి బాల్ రెడ్డి ఉన్నారు. రైతులకు ఎలాంటి సందేహాలు , సమస్యలు ఉన్నా వ్యవసాయం అధికారులను సంప్రదించాలని సూచించారు.

# గ్రీన్ హైడ్రోజన్ ప్రమాణాలు, భద్రతా నియమావళిపై భారత్-యూకే సమావేశం.. సురక్షితమైన గ్రీన్ హైడ్రోజన్ విస్తరణకు సహకారం

న్యూఢిల్లీ, మార్చి 9:భారత ప్రభుత్వ జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో భాగంగా గ్రీన్ హైడ్రోజన్‌ను సురక్షితంగా వినియోగంలోకి తీసుకురావడంలో సహకారాన్ని బలోపేతం చేసేందుకు 27 ఫిబ్రవరి 2026న న్యూఢిల్లీలో "గ్రీన్ హైడ్రోజన్ ప్రమాణాలు, భద్రతా నియమావళి" పై భారత్-యూకే సదస్సు జరిగింది. ఈ సమావేశంలో భారత్, బ్రిటన్ దేశాలకు చెందిన ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, ప్రమాణాల సంస్థలు, పరీక్షా కేంద్రాలు, పరిశోధనా సంస్థలు, నియంత్రణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత్‌లోని బ్రిటిష్ హై కమిషన్, డబ్ల్యూఆర్ఐ ఇండియా సహకారంతో జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు మద్దతుగా నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ పరిధిలో స్థాపించిన జాతీయ హైడ్రోజన్ భద్రతా కేంద్రం (ఎన్‌సీహెచ్ఎస్) ఈ సమావేశాన్ని నిర్వహించింది. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వ, రవాణా, వినియోగం వంటి మొత్తం వ్యవస్థలో పాటించాల్సిన నియంత్రణ విధానాలు, అంతర్జాతీయ ప్రమాణాలు, భద్రతా నియమావళిపై ఈ సదస్సులో కీలక చర్చలు జరిగాయి.

జాతీయ సౌరశక్తి సంస్థ డైరెక్టర్ జనరల్ మహ్మద్ రిహాన్ ప్రారంభ ఉపన్యాసంతో ఈ సదస్సు మొదలైంది. అనంతరం నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ డైరెక్టర్ అభయ్ బక్రే, భారత్‌లోని బ్రిటిష్ హై కమిషన్ తొలి కార్యదర్శి(వాణిజ్యం) జినూస్ షరియాతి, పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ మండలి కార్యదర్శి అంజన్ కుమార్ మిశ్రా, బ్రిటిష్ హై కమిషన్ తొలి కార్యదర్శి (వాతావరణం, శక్తి) లారా అయ్లెట్ ప్రత్యేక ప్రసంగాలు చేశారు.

భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయం కార్యదర్శి పర్విందర్ మైని ప్రసంగిస్తూ.. గ్రీన్ హైడ్రోజన్ సాంకేతికతలను పెద్ద ఎత్తున అమలు చేయడానికి బలమైన భద్రతా చర్యలు, ప్రమాణాల అభివృద్ధి, అంతర్జాతీయ సహకారం అవసరమని తెలిపారు.

హైడ్రోజన్ భద్రత, ప్రమాణాలకు బాధ్యత వహించే జాతీయ నియంత్రణ సంస్థల భాగస్వామ్యం ఈ సదస్సులో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పీఈఎస్ఓ), హైడ్రోజన్ వ్యవస్థల భద్రతా నిబంధనల అమలు, ప్రమాద అంచనా, విపత్తు నిర్వహణపై నియంత్రణ దృక్పథాలను పంచుకుంది. భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్), అభివృద్ధి చెందుతున్న ప్రమాణాల విధానాలు, భారతీయ హైడ్రోజన్ ప్రమాణాలను అంతర్జాతీయ అత్యుత్తమ విధానాలతో అనుసంధానించడానికి జరుగుతున్న ప్రయత్నాలపై వివరణ ఇచ్చింది.సదస్సులోని సాంకేతిక కార్య క్రమాల్లో పరిశ్రమలు, విద్యాస ంస్థలు, పరిశోధనా సంస్థలకు చెందిన ప్రముఖ నిపుణులు హైడ్రోజన్ వ్యవస్థలో పాటించాల్సిన భద్రతా పద్ధతులపై చర్చలు జరిపారు. భారత ఆటోమొబైల్ సంస్థ తయారీదారులు, ఎన్‌టీపీసీ లిమిటెడ్, ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు, సీఎస్ఐఆర్-నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీ, ఐఐటీ మద్రాస్ వంటి సంస్థల ప్రతినిధులు ఈ చర్చల్లో ప్రసంగించారు.

హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వ, రవాణా వ్యవస్థల సురక్షిత రూపకల్పన, ప్రమాదాల అంచనా పద్ధతులు, గతంలో జరిగిన సంఘటనల విశ్లేషణ, హై డ్రోజన్ భద్రత కోసం ఆధునాతన సెన్సార్ సాంకేతికత, కృత్రిమ మేధ ఆధారిత పర్యవేక్షణ వంటి అత్యాధునిక ఆవిష్కరణల గురించి చర్చించారు. విశ్వసనీయమైన, గ్రీన్ హైడ్రోజన్ సాంకేతికతలను విస్తరించడానికి అవసరమైన ప్రమాణాల అభివృద్ధి, నియంత్రణ సామర్థ్య పెంపు, భద్రతా విధానాల రూపకల్పనలో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని భారత్-యూకే ఉమ్మడి నిబద్ధతతో ఈ సమావేశం ముగిసింది.

# త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు..

-జిల్లా కలెక్టర్, అధికారుల తో ప్రత్యేక సమావేశమై..
-జర్నలిస్టుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం..
-పత్రికారంగం చాలా ప్రత్యేకం..
-మీడియా ఫోర్త్ పిల్లర్..
-ప్రజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయుల పాత్ర కీలకం.
-టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్
-ప్రెస్ క్లబ్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం మహోత్సవం..

నిజామాబాద్, మార్చి 9:జర్నలిస్టుల చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాల విషయమై జిల్లా కలెక్టర్ అధికారులతో ప్రత్యేక సమావేశమై త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్



గౌడ్ అన్నారు. ప్రజాస్వా మ్య వ్యవస్థలో పాత్రికే యుల పాత్ర అత్యంత కీలకమని బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పత్రికా రంగానికి ఎంతో ప్రత్యేక ప్రాధాన్యత ఉంద ని అన్నారు. ప్రజా సమ స్యలను ప్రభు త్వానికి రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లే వారధి మీడియా నేనని బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అండగా ఉం టానని జర్నలిస్టుల సమ స్యల పరిష్కా రానికి కృషి చేస్తానని అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బస్వా గార్డెన్ లో ప్రెస్ క్లబ్ నూత న కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం అంగ రంగ వైభవంగా జరుపుకున్నా రు.

ఈ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహో త్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు మొహమ్మద్ షబ్బీర్ అలీ, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ,అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ, తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహే ర్ బిన్ హుందాన్,నగర మేయర్ కూరగాయల ఉమారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పాగంగారెడ్డి, వేలే నెన్ ఆస్పత్రి ఎండీ అసద్ ఖాన్, వెల్నెస్ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి రాజకీ య నాయకులు ప్రముఖులు ము ఖ్య అతి థులుగా హాజ రయ్యారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కమిటీ నూతన కార్యవర్గం ముఖ్య అతిథు లను శాలువాతో ఘనంగా సన్మానించారు.

### టిపిసిసి అధ్యక్షుల చేతుల మీదుగా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం..

ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశా ధికారి, ఉపాధ్యక్షులు, సం యుక్త కార్యదర్శులు, కార్య నిర్వాణ కార్యదర్శి, కార్య వర్గ సభ్యులను టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేయిం చారు. ప్రెస్ క్లబ్ అభివృ ద్ధికి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి టీపీసీసీ అధ్యక్షులు సూచించారు

### నూతన కార్యవర్గానికి సన్మానం

ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ నూతన కమిటీ నూతన కార్యవ ర్గాన్ని ముఖ్య అతిథులు శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్షులను ముఖ్య అతిథులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

### జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి.. ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

ఎన్నో సంవత్సరా ల నుంచి ఎదురు చూస్తున్న జర్న లిస్టుల చిరకాల వాంఛ అయిన జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు డబుల్ బెడ్ రూమ్ ,ఇళ్ల స్థలాల విషయమై ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఆధ్వర్యం లో జర్నలిస్టులు ముఖ్య అతిథులకు ఈ సందర్భం గా వినతి పత్రం అందజేశా రు.

### జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా.. పత్రికా రంగం చాలా ప్రత్యేకం టిపిసిసి అధ్యక్షు లు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

జర్నలిస్టుల్లో లేనిది రాజకీయ నాయకులు లేరనే సూక్తి నేను నమ్ము తానని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నా రాజ కీయ మార్గంలో ఎందరో జర్నలిస్టులు నాకు ఎంతో సహకారం అందిం చారని ఈ సందర్భంగా తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని అన్నారు.సమాజంలో నాలుగో స్తంభమైన జర్నలిజం వ్యవస్థ పటిష్టంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవి ల్లుతుం దని పేర్కొన్నారు.

నిజామాబాద్ జర్నలిస్టుల చిరకాల కోరిక అయిన ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విధి నిర్వహణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాము గుర్తిస్తున్నామని, వారి ఆరోగ్య భద్రత (హెల్త్ కార్డ్స్) విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. వార్తల సేకరణలో వాస్తవాలకు ప్రాధాన్యతనిస్తూ, పేదల గొంతుకగా నిలవాలని ఆయన నూతన కార్యవ ర్గానికి సూచించారు.

ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం లోనూ, క్షేత్రస్థాయి సమ స్యలను ప్రభుత్వానికి వివరించడంలోనూ జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని కోరారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, జర్నలిస్టు ల సంక్షేమం కోసం ఎమ్మెల్సీగా తన మద్దతు కొనసా గుతుందని స్పష్టం చేశారు

### ఎన్నికైన ప్రెస్ క్లబ్ నూతన కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

అధ్యక్షులు వంచరెడ్డి శ్రీకాంత్,ప్రధాన కార్యదర్శి డా॥ వాగ్మారే సుభాష్, కోశాధికారి రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.రాజు, ఉపాధ్యక్షులు బైసా సంగీత,సతీష్ గౌడ్, గోవింద రాజు, సంయుక్త కార్యదర్శి రవీందర్ నాయ క్,ఆంజ నేయులు, కార్యవర్గ సభ్యులు సితారే కృష్ణ, పబ్బ భూమేష్, ఆడెపు నరేంద్ర స్వామి, జి.భాస్కర్ గౌడ్, సందీప్ దేశ్ ముఖ్, కొట్టూరు సుదర్శన్, రవి చరణ్ రెడ్డి, తాళ్ళ శ్రీధర్, ప్రీతం రెడ్డి, ఆడెపు శ్రీనివాస్, సి ఎస్ జయ పాల్, కొక్కు రవి ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి రాంభూ పాల్ ,కాంగ్రెస్ పార్టీ జిల్లా ,నగర అధ్య క్షులు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, కాటిపల్లి నరేందర్ రెడ్డి, ఖుద్దూస్, వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నెయ్యి ట్యాంకర్ బోల్తా.. బిందెలతో ఎగబడ్డ జనం

అమరావతి, మార్చి 9: ఫ్రీగా వస్తే ఫినాయిల్‌నైనా ఎగబడి తీసుకునే జనం నెయ్యి కోసం నానా తంటలు పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. కడప జిల్లా కొండాపురం మండలం అనంతపురం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం ప్రమాదవశాత్తు నెయ్యి ట్యాంకర్ బోల్తా పడింది. ట్యాంకర్‌లో ఉన్న నెయ్యి నేలమట్టం అవుతుందని తెలుసుకున్న స్థానికులు ఇంట్లో ఉన్న బిందెలు, బకెట్లు, గిన్నెలు, ప్లాస్టిక్ జగ్గులు, ఇతర చిన్న చిన్న వస్తువులతో చేరుకున్నారు. ట్యాంకర్ నుంచి కారిపోతున్న నెయ్యి కోసం ఎగబడ్డారు.

# నిర్మల్‌లో విషాదం.. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

నిర్మల్, మార్చి9: నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంతో వచ్చిన బైక్ అదుపుతప్పి ఈదిగామ వద్ద ఉన్న గోల్డెన్ ఫంక్షన్ హాలు ముందు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతులను మంజులాపూర్‌కు చెందిన సృజన్ (33), నటరాజ్ నగర్‌కు చెందిన ప్రఫుల్ (34)గా గుర్తించారు. నిర్మల్ వైపుగా బైక్‌పై వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# మూడు నౌకల డాకింగ్‌కు ఇరాన్ అనుమతి కోరింది.. మార్చి 1న ఇచ్చాం: ఎస్ జైశంకర్



న్యూఢిల్లీ, మార్చి 9: మూడు యుద్ధ నౌకల డాకింగ్ కోసం ఫిబ్రవరి 28న ఇరాన్ అనుమతి కోరినట్లు విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. అయితే మార్చి 1న అనుమతి ఇచ్చినట్లు ఆయన చెప్పారు. (రా ఏజీతిబఫ్త్రజీనిఎజీ) అమెరికా- ఇరాన్ యుద్ధాన్ని ముగించడానికి దౌత్యపరమైన చర్చలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితి గురించి విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సోమవారం రాజ్యసభలో ఒక ప్రకటన చేశారు. ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని అన్నారు. దేశాల మధ్య శత్రుత్వాలు తీవ్రమవుతున్నాయని, భద్రతా పరిస్థితి గణనీయంగా క్షీణించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్రిక్తతలను తగ్గించాలని, సంయమనం పాటించాలని ఆయా దేశాలకు పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో నివసిస్తున్న 10 మిలియన్ల మంది భారతీయుల భద్రత, ఇంధన భద్రత, వాణిజ్యంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు.

కాగా, గత నెలలో భారతదేశం నిర్వహించిన అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ విన్యాసాల్లో పాల్గొన్న మూడు ఇరాన్ యుద్ధ నౌకల గురించి కూడా ఎస్ జైశంకర్ రాజ్యసభలో మాట్లాడారు. 'ఈ ప్రాంతంలోని మూడు నౌకలు భారత ఓడ రేవులలో డాక్ చేయడానికి ఫిబ్రవరి 28న ఇరాన్ అనుమతి కోరింది. దీనికి మార్చి 1న ఆమోదం లభించింది' అని అన్నారు. ఇరాన్ యుద్ధ నౌక ఐఆర్ఐఎస్ లావన్ మార్చి 4న కొచ్చిలో డాక్ అయ్యిందని చెప్పారు. భౌగోళిక రాజకీయ పరిగణనల కంటే 'మానవత్వం' కారణంగా భారత్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు శనివారం నాటి కార్యక్రమంలో స్పష్టం చేశారు.

మరోవైపు మార్చి 4న హిందూ మహాసముద్రంలో ఉన్న మరో ఇరాన్ యుద్ధ నౌక ఐఆర్ఐఎస్ దేనాను అమెరికా జలాంతర్గామి పేల్చి ముంచేసింది. అందులోని 130 మంది సిబ్బందిలో 80 మందికిపైగా నావికులు మరణించారు. శ్రీలంక నౌకా దళం సుమారు 32 మంది సిబ్బందిని రక్షించింది.

అయితే భారత్ అతిథిని అమెరికా దారుణంగా దెబ్బతీసిందని ఇరాన్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో వచ్చిన విమర్శలపై జైశంకర్ స్పందించారు. ఈ సంఘటన దురదృష్టకరమని అన్నారు. భారత నేవీ కూడా రెస్క్యూలో పాల్గొన్నట్లు చెప్పారు. మానవత్వంతో మరో ఇరాన్ యుద్ధ నౌకను రక్షించినట్లు వెల్లడించారు.

# కొన్ని నెలలుగా థాయ్‌లాండ్‌లో చిత్రహింసలకు గురవుతున్న ఆరుగురు భారత కార్మికులను ఎన్‌హెచ్‌ఆర్‌సీ స్వచ్ఛంద జోక్యంతో రక్షించిన ఎంఈఏ

న్యూఢిల్లీ, మార్చి 9:థాయ్‌లాండ్‌లో ఆరునెలలుగా యజమాని చెరలో హింసకు గురవుతున్న ఆరుగురు భారతీయ కార్మికుల విషయంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) స్వచ్ఛందంగా తీసుకున్న చర్యల ఫలితంగా కేంద్ర విదేశీ వ?యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) స్పందించి, వారిని రక్షించింది. ఫిబ్రవరి 20, 2026న ఎన్‌హెచ్‌ఆర్‌సీ సమాచారం అందించిన వెంటనే ఎంఈఏ తక్షణ చర్యలు చేపట్టింది. దీంతో మరుసటి రోజే నలుగురు భారత్‌కు తిరిగి వచ్చారు. యజమాని టికెట్లు బుక్ చేసిన విమానంలో వారు బ్యాంకాంక్ నుంచి కోల్‌కతా చేరుకున్నారు.

ఎంఈఏ రక్షించిన మిగతా ఇద్దరి కార్మికుల వీసా గడువు ముగియటంతో తిరిగి స్వదేశానికి రప్పించే అంశంపై థాయ్ ఇమ్మిగ్రేషన్ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు మంత్రిత్వ శాఖ దక్షిణ విభాగం వెల్లడించింది.

మీడియా నివేదికను పరిగణనలోకి తీసుకున్న కమిషన్, బందీలుగా ఉన్న ఆరుగురు కార్మికులకు ఏదైనా సహాయం అందించాలని ఫిబ్రవరి 20, 2026న ఎంఈఏను కోరింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ నుంచి సమాచారం అందిన వెంటనే స్పందించిన ఎంఈఏ దక్షిణ విభాగం, థాయ్ అధికారులకు అభ్యర్థన పంపింది. ఆరుగురు కార్మికులు పనిచేస్తున్న కంపెనీ యజమానిని కూడా సంప్రదించింది.

ఒడిశాలోని కేంద్రపారా జిల్లాకు చెందిన కార్మికులు, వారి దీనస్థితిని వివరిస్తూ చేసిన వీడియో గురించి ఫిబ్రవరి 17, 2026న మీడియాలో వార్తలొచ్చాయి. బ్యాంకాక్ సమీపంలోని ఫ్యాక్టరీలో యజమాని తమను బందీలుగా ఉంచి శారీరకంగా, మానసికంగా హింసకు గురిచేస్తున్నట్లు కార్మికులు పేర్కొన్నారు. వేతనం, సరైన ఆహారం లేకుండా ప్లైవుడ్ ఫ్యాక్టరీలో రోజుకు 12 గంటలు పని చేయించుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వారి పాస్‌పోర్టులను కూడా యజమాని లాక్కున్నట్లు తెలిపారు.

# ఢిల్లీలో వివిధ అభివృద్ధి పథకాల ప్రారంభానికి సంబంధించిన ముఖ్యాంశాల్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మార్చి 9:ఢిల్లీలో వివిధ అభివృద్ధి పథకాల ప్రారంభానికి సంబంధించిన ముఖ్యాంశాల్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజలతో పంచుకున్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో శ్రీ మోదీ వరుసగా కొన్ని సందేశాలను పొందుపరుస్తూ -

"ఢిల్లీలోని సరోజినీ నగర్‌లో గల జీపీఆర్ఏ నివాస స్థలాల్లో మహిళా లబ్ధిదారులకు కొత్త ఇళ్ల తాళం చెవులను అందజేసినందుకు ఎంతో సంతోషం కలిగింది. ప్రభుత్వోద్యోగుల కోసం ఆధునిక సదుపాయాలతో నిర్మించిన ఈ ఇళ్లు మౌలిక సదుపాయాల కల్పన విషయంలో మా నిబద్ధతకు ఒక శక్తిమంతమైన ఉదాహరణగా నిలుస్తున్నాయి."

"అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా జీపీఆర్ఏ క్వార్టర్స్ నిర్మాణంలో ముఖ్య తోడ్పాటును అందించిన మన మహిళా సిబ్బందితో మాటామంతీ జరపడంతో కొత్త శక్తిని సంతరించుకున్నానన్న అనుభూతిని ఇచ్చింది."

"ఈ రోజు ఢిల్లీ మెట్రోకు సంబంధించిన ఒక ప్రదర్శనను చూసే సదవకాశం లభించింది. ఈ ప్రదర్శనను చూశాక, శరవేగంగా విస్తరిస్తున్న మెట్రో రైలు.. ఢిల్లీ ప్రజల జీవనాన్ని మరింత సుగమంగా, సౌకర్యవంతంగా ఎలా తీర్చిదిద్దుతోందో అర్థం చేసుకొనేందుకు అవకాశం లభించింది."

"అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు నా మాతృమూర్తులు, అక్కచెల్లెళ్లు, కుమార్తెలు.. వీరందరితో చర్చించే చక్కని అవకాశం లభించింది. ఈ సందర్భంగా.. శక్తిస్వరూపిణులైన మహిళల్లో ఉట్టిపడుతున్న ఆత్మవిశ్వాసాన్ని గమనిం చినప్పుడు గర్వంగా అనిపించింది."

"న్యూఢిల్లీలోని శక్తిమంతమైన మహిళా ప్రతినిధులకు ఆయుష్మాన్ కార్డులనీ, స్వనిధి క్రెడిట్ కార్డునీ అందజేసే సౌభాగ్యం ఈ రోజు దక్కింది. వారికి ఆరోగ్య భద్రతని అందించడంతో పాటు ఆర్థిక సాధికారితని కల్పించే దిశగా ఇదొక కీలక చర్య."

"అభివృద్ధి సాధన విషయంలో ఢిల్లీలోని నా కుటుంబసభ్యుల్లో ఉరుముతున్న ఉత్సాహాన్నీ, ఉల్లాసాన్నీ చూస్తే హృదయం ఉప్పొంగిపోయింది."

"ఢిల్లీ ప్రగతి ప్రస్థానం పూర్తి దేశంలో ప్రసరిస్తున్న ప్రభావంతో ముడిపడి ఉంది. ఈ కారణంగా ఇక్కడి మెట్రో సౌకర్యాలతో పాటు, ఇతరత్రా మౌలిక సదుపాయాల కల్పన కూడా శరవేగంగా విస్తరిస్తుండడం చూసి నాకెంతో ఆనందం కలుగుతోంది."

" 'ఆప్'దా వాళ్ల విధానం చూస్తే.. పని తక్కువ, సాకులు ఎక్కువన్నట్లు ఉంది. ఇవాళ ఢిల్లీలో అభివృద్ధి నమూనాను గమనిస్తే.. సాకులకు స్వస్తి, పనులకు నాందీప్రస్తావన అని స్పష్టమవుతోంది."

"వీధుల్లో తిరుగుతూ వస్తువులను విక్రయించే సహచరులను దృష్టిలో పెట్టుకొని స్వనిధి క్రెడిట్ కార్డుల ఉద్యమాన్ని మా ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్డులు పేదల ఆత్మాభిమానానికి కొత్త అండగా నిలుస్తున్నాయి."

"అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నేను ఇవాళ ఎంతో గర్వంగా చెబుతున్నాను మాటలు.. దేశం 3 కోట్ల మంది మహిళలను లఖ్‌పతి దీదీలు (లక్షాధికారి అక్కలూ, చెల్లెమ్మలు)గా తీర్చిదిద్దాలనే సంకల్పాన్ని చెప్పుకొని, ఆ సంకల్పాన్ని నెరవేర్చింది. ఈ రోజున మనం మరో సంకల్పాన్ని చెప్పుకొంటున్నాం.. మరో 3 కోట్ల మంది అక్కచెల్లెమ్మలు కూడా లఖ్‌పతి దీదీలుగా మారుతారు అనేదే ఆ సంకల్పం.

"ఈ రోజు దేశ ప్రజలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించు కొంటున్నారు. నిన్న పశ్చిమ బెంగాల్లో టీఎంసీ ప్రభుత్వం దేశ రాష్ట్రపతి గౌరవ ద్రౌపదీ ముర్ము గారిని ఘోరంగా అవమానించింది. రాష్ట్రపతి పాల్గొన్న కార్యక్రమంలో సముచిత ఏర్పాట్లను చేయలేదు. పశ్చిమ బెంగాల్లోని విజ్ఞత కలిగిన ప్రజలు.. ఒక మహిళను అవమానించిన, ఒక గిరిజన మహిళను అగౌరవపరిచిన, దేశ గౌరవ రాష్ట్రపతిని అనాదరణకు గురి చేసినందుకు టీఎంసీని ఎన్నటికీ క్షమించరు" అని పేర్కొన్నారు.

# కల్తీ నూనెలు, గోధుమ పిండి తయారీ.. తండ్రీకొడుకుల అరెస్ట్

హైదరాబాద్, మార్చి 9: గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో కల్తీ నూనెలు, గోధుమ పిండి తయారీ ముఠా గుట్టు రట్టైంది. కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్న ముఠాను మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు. మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు నిర్వహించిన దాడుల్లో తండ్రీ, కొడుకులను అరెస్టు చేశారు. వట్టినగులపల్లి ఇందిరమ్మ కాలనీలోని శ్రీ జస్నాత్ ట్రేడర్స్ దుకాణంపై ఎస్వోటీ పోలీసులు ఈరోజు(సోమవారం) దాడి చేశారు.

గడువు ముగిసిన వివిధ కంపెనీల వంట నూనెలను సేకరించి, సోయాబీన్ నూనెతో కలిపి కల్తీ వంట నూనెను నిందితులు తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అలా తయారైన నూనెను వివిధ ప్రసిద్ధ బ్రాండ్ల పేర్లతో ప్యాక్ చేసి మార్కెట్‌లో అమ్ముతున్నట్లు దాడుల్లో బయటపడింది. అదే విధంగా గడువు తీరిన గోధుమ పిండిని వివిధ ప్రాంతాల నుంచి సేకరించి... 'జస్నాత్ గోల్డ్ చక్కి అట్టా' పేరుతో తిరిగి ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రైడ్‌లో సుమారు 10 లక్షల రూపాయల విలువైన 5,026 లీటర్ల కల్తీ వంట నూనె, 3 లక్షల రూపాయల విలువైన 5,192 కిలోల గోధుమ పిండిని స్వాధీనం చేసుకున్నారు.

వెయిటింగ్ మెషిన్, ఆయిల్ ఫిల్టర్ మెషిన్, గోధుమ ఫిల్టర్ మెషిన్‌తో పాటు ఇతర సామాగ్రిని కూడా సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న మొత్తం వస్తువుల విలువ సుమారు 21 లక్షల రూపాయలుగా అంచనా వేశారు. ఈ కేసులో రాజస్థాన్‌కు చెందిన భన్వర్ రామ్ జాట్ (46), అతని కుమారుడు అశోక్ కుమార్‌లను అరెస్టు చేశారు. నిందితులను గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# డేటా, ఏ ఐ ని ఉపయోగించుకోవడం ద్వారా వ్యాపార ఆవిష్కరణలను కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాలిబోతో భాగస్వామ్యం

హైదరాబాద్, మార్చి 9:డేటా, ఏ ఐ ఆవిష్కరణలను వేగవంతం చేయడంలో సంస్థలకు సహాయపడే బి 2 బి టెక్నాలజీ కంపెనీ కాలిబో , ఏ ఐ-సిద్ధంగా ఉన్న ప్రతిభ బాధ్యతాయుతమైన ఏ ఐ ఆవిష్కరణలతో వేగవంతమైన వినియోగ కేస్ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో రెండు అవగాహన ఒప్పందాలు ( ఎం ఓ యు లు )పై సంతకం చేసింది. ఈ భాగస్వామ్యంలో 50+ ఉన్నత విద్యా సంస్థలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఏ పి ఎస్ ఎస్ డి సి) సహకారంతో కాలిబో ఏ ఐ అకాడమీని మోహరించడం ఉత్పత్తి వాతావరణాల బయట ప్రభుత్వ రంగ ఏ ఐ వినియోగ కేసుల రూపకల్పన, నిర్మాణం సురక్షితమైన అనుభవాన్ని ప్రారంభించడానికి రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్ టి జి ఎస్ )తో కాలిబో ఏ ఐ ఇన్నోవేషన్ సాండ్‌బాక్స్‌ను అమలు చేయడం ఉన్నాయి .

ఈ భాగస్వామ్యాలు కలిసి, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ ఏ ఐ ఇన్నోవేషన్ హబ్‌గా నిలబెట్టడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాయి. అదే సమయంలో పరిశ్రమకు సిద్ధంగా ఉన్న ప్రతిభావంతుల సమూహాలు చిన్న ఏ ఐ ప్రయోగాలతో ఉపాధి ఆర్థిక ఫలితాలను బలోపేతం చేస్తాయి.


# మహిళ శక్తే ఈనాడు దేశ భవిష్యత్తు..

-డీటీసీ యం. పురేంద్ర

విజయవాడ, మార్చి9: ప్రభుత్వ కార్యాలయల్లో పనిచేస్తున్న మహిళలు ఒకపక్క కుటుంబం రెండో పక్క ఉద్యోగ బాధ్యతలను నెరవేరుస్తూ నేటి సమాజానికి ఆదర్శంగా ఉంటున్నారని డీటీసీ యం. పురేంద్ర అన్నారు. స్థానిక బందరు రోడ్డులోని డీటీసీ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీటీసీ ఎం పురేంద్ర ముఖ్య అతిథులుగా హాజరైనారు.

ఈ సందర్భంగా డీటీసీఎం పురేంద్ర మాట్లాడుతూ మహిళల హక్కులు, మహిళా కార్మికులకు సమాన వేతనం, మెరుగైన పని పరిస్థితులు, ఓటు హక్కు మొదలగు వాటిపై ఆనాడు మహిళలు ఉద్యమాలు చెప్పట్టారని ఆయన అన్నారు. దాని ఫలితమే ఈనాడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని ఆయన తెలిపారు. మహిళలకు సమాన హక్కులు, సాధికారత, సమాజ అభివృద్ధిలో వారి పాత్రను గౌరవిస్తూ ప్రపంచ వ్యాప్తం గా మహిళలను గౌరవించడం జరిగిందన్నారు.

కుటుంబానికి ఆదారంగా, సమాజానికి ఆదర్శంగా, దేశ అభివృద్ధికి శక్తిగా మహిళలు నిలుస్తున్నారని ఆయన కొనియాడారు. మహిళలను గౌరవించడం మన సమాజ పురోగతని, మహిళ శక్తే ఈనాడు దేశ భవిష్యత్తని ఆయన అన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులకు సన్మానం చేసి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ




మహిళా ఉద్యోగులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్స వం శుభాకాంక్షలు డిటిసి ఎం పురేంద్ర తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టీవోలు పద్మావ తి, ఆర్ ప్రవీణ్, ఎస్ వెంకటేశ్వరరావు, ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షులు ఎం రాజుబాబు, మోటార్ వాహన తనిఖీ అధికారులు పద్మాకర్, ఉదయ్, అలీ,, గీతాంజలి, ప్రియదర్శిని, దివ్య, కార్యాలయ పరిపాలన అధికారులు అబ్దుల్ సత్తార్, సత్యనారాయణ, లలిత, ఉష సుందరి, రిటైర్డ్ ఆర్టీఓ రాజారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే

మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగానినదించినది సావిత్రిబాయి పూలే. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం సల్పిన అభ్యుదయ వాది ఆమె. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ మూర్తి. సమాజపు కట్టు బాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారత దేశపు మొట్ట మొదటి ఉపాధ్యాయు రాలుగా పాఠశాలలు ప్రారంభించిన ధీశాలి. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సమ న్యాయవాది. మహిళా శిరోముండ నానికి వ్యతిరేకంగా పోరాడిన సాంప్రదాయ వ్యతిరేకి. భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపిన సంస్కరణ వాది. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇదే.

సావిత్రి పూలే (3 జనవరి 1831 – 10 మార్చి 1897) గొప్ప సంఘ సంస్కర్త, నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి సమాజంలోని కులతత్వం, పురుషాధిక్యత ధోరణులకు వ్యతిరేకంగా సమష్టిగా పోరాటం చేసారు. కలిగిన చాలామందికి ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు. కానీ ఆమె ఆధునిక భారత దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి.

సావిత్రీ బాయి మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న ఒక రైతు కుటుంబంలో జన్మించారు. ఆమె కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. బంధువులు నిజామాబాద్ జిల్లా లో బోధన్, నాందేడ్ కొండల్ వాడి ప్రాంతంలో , అదిలాబాద్ ప్రాంతపు చుట్టుపక్కల మున్నూరు కాపులు వారికి చుట్టాలు. ఆమె తన 9వ యేట 12 ఏళ్ళ జ్యోతిరావు పూలెను 1840లో వివాహ మాడారు. నిరక్షరాస్యురాలిగా ఉన్న ఆమెకు భర్త జ్యోతిరావు పూలే మొదటి గురువు. భర్త ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతు రాలైనారు. అహ్మద్ నగర్ లో ఉపాధ్యాయ శిక్షణ పొంది 1848 లో భర్త జ్యోతిరావుతో కలిసి క్రింది కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించారు. ఆ పాఠశాల నడపటం ఉన్నత, అగ్రవర్ణాలకు నచ్చలేదు. దీంతో ఆమెపై వేధింపులకు, భౌతిక దాడులకు పూనుకున్నారు. పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్లు విసరడం, అసభ్య పదజాలాన్ని వాడటం వంటివి చేశారు. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తరువాత మార్చుకుని, మరలా వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చే వారు. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా "నా విధిని నేను నిర్వహిస్తున్నాను" అని చెప్పే వారు. ఆమె సాగించిన విద్యా ఉద్యమానికి తక్కువ సమయం లోనే సహకారం గుర్తింపు లభించాయి. ఒక ముస్లిం వ్యక్తి తన ఇంటిని బడికి కేటా యించాడు. కొంత మంది పుస్తకాలు సేకరించారు. మోరోవిఠల్, వాల్వేకర్, దియోరావ్ వంటి ప్రముఖులు పాఠశాల నిర్వహణకు సహకరించారు. 1851లో మరో పాఠశాల ప్రారంభించారు. ఉపాధ్యాయురాలిగా అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు లాంటి హక్కులు నిరాకరింపబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, సనాతన సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయు రాలుగా పాఠశాలలు ప్రారంభించి,12 మే 1848న దేశంలో బహు జనులకు మొట్టమొదటి పాఠశాల ప్రారంభించారు. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి ఆమె. కేవలం 4 సంవత్సరాలలోనే గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యను అందించారు. దళితుల, స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళు మాత్రమే. ఆమె జీవిత

## మార్చి 10...సావిత్రిబాయి పూలే వర్ధంతి



**మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా పాఠశాలలు ప్రారంభించి,12 మే 1848న దేశంలో బహు జనులకు మొట్టమొదటి పాఠశాల ప్రారంభించారు.**

కాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొనడమే కాక, 1849లో పూలే, సావిత్రీబాయి దంపతు గృహ బహిష్కారానికి గురి అయినారు.

సామాజిక విప్లవకారిణిగా ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్య పరచడానికి 1852లో మహిళా సేవామండల్ పేరున మహిళా సంఘాన్ని కూడా స్థాపించింది. లింగ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచి వేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఆ సంస్థ కృషిచేసింది.

కులవ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో సత్యాన్ని శోధించడానికి 1873 లో తన భర్త మహత్మా పూలేతో కలసి "సత్యశోధక్ సమాజ్ "ను ప్రారంభించి బాల్య వివాహాలకు, మూఢ నమ్మకాలకు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా, వితంతువు పునఃర్వివాహాల కొరకు అసమాన వ్యవస్థకు వ్యతి రేకంగా బలమైన ఉధ్యమం నడిపారు. బాల్యం లోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్దేవదిలేసి పోయిన ఓ బిడ్డను అక్కున చేర్చుకున్నారు. యశ్వంత్ గా నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించి, క్షురకులను చైతన్య పరిచి వితంతువులకు శిరో ముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు. తరువాత 1873 సెప్టెంబరు 24న "సత్యసోధక్ సమాజ్" అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, ఉద్యమాన్ని నడిపారు. ఆ సత్యసోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. 1873 డిసెంబరు 25న భార్యను కోల్పోయిన ఒక యువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో సత్యసోధక్ సమాజ్ ఆధ్వర్యన సావిత్రీబాయి వివాహం జరిపించారు. 1868 నుంచి సావిత్రీబాయి అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడి నప్పుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాల లోని అనాథ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు. తమ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. సావిత్రిబాయి సంఘ సంస్కర్త గానే గాదు, రచయిత్రిగా కూడా పేరెన్నిక గన్నారు. 1854లోనే ఆమె తన కవితా సంపుటి 'కావ్య పూలే'ను, మరో కవితా సంపుటి 'పావన కాశీ సుభోధ్ రత్నాకర్'ను 1891లో ప్రచురించారు. ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తక రూపంలో వచ్చాయి.

జ్యోతీరావు పూలే 1890 నవంబరు 28న మరణించడంతో సావిత్రీబాయి అంతులేని దుఃఖ సాగరంలో మునిగి పోయి కూడా, దుఃఖంలోనుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టారు. తన భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇదే. ఫూలే మరణాంతరం సత్యసోధాక్ సమాజ్ భాద్యతను స్వీకరించి నడిపించారు. 1897 లో ప్లేగు వ్యాధి, పూణే నగరాన్ని వణికించింది. నగరమంతా ఎడారిగా మారింది. జనమంతా దగ్గర్లోని అడవుల్లోకి పారిపోయారు. అయినా సావిత్రీబాయి పూలే కొడుకు యశ్వంత్ తో కల్సి వ్యాధి గ్రస్తులకు సేవ చేసారు.

1896–97లో సంభవించిన తీవ్ర కరువు, ప్లేగు వ్యాధి మహారాష్ట్ర జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఈ పరిస్థితుల్లో కరువు ప్రాంతాల్లోని దళితులు పేదలకు జోలెపట్టి విరాళాలు సేకరించి అందించారు. ప్లేగువ్యాధి సోకిన పేదలకు దగ్గరుండి సేవలందించారు. 1890వ దశకంలో ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించారు. దుర్భరమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు 2 వేల మంది పిల్లలకు భోజనాలు పెట్టించారు. ప్లేగు వ్యాధి సోకిన మాంగ్ లాంటి కులాలకి చెందిన దళిత చిన్న పిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడారు. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకు సోకి మార్చి 10, 1897 లో మరణించారు. ఆమె దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు జరిపించాడు. సావిత్రిబాయి జయంతిని భారతదేశ "మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం"గా జరుపు కుంటారు. 1997లో భారత ప్రభుత్వం సావిత్రిబాయి జ్ఞాపకార్థం తపాలా స్టాంపును విడుదల చేసింది. పూణే విశ్వ విద్యాలయానికి సావిత్రిబాయి పేరు పెట్టారు.



–రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# ఆల్ఫోర్స్ స్కూల్స్‌లలో ఘనంగా "సయిరి" వీడ్కోలు




కరీంనగర్, మార్చి9: (నేటిని జం ప్రతినిధి) అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్, గర్ల్స్ టెక్నో స్కూల్, టైనీ టాట్స్ పాఠశాలల పదవ తరగతి విద్యార్థుల కోసం నిర్వహించిన "సయిరి" వీడ్కోలు కార్యక్రమం స్థానిక రేకుర్తిలోని ఒక ప్రైవేట్ వేడుక మందిరంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు సరస్వతి దేవి విగ్రహానికి పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా తమ జీవితంలో లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటిని సాధించడానికి స్పష్టమైన ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ పట్టు సాధిస్తే అభివృద్ధి పరీక్షల్లో విజయం సాధించడం సులభమవుతుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పాఠశాలల్లో వివిధ విషయాలపై విస్తృత అవగాహన కల్పిస్తూ, వివిధ స్థాయిల పోటీ పరీక్షలకు సిద్ధం చేసే విధంగా శిక్షణ అందిస్తున్నామని ఆయన తెలిపారు. రానున్న పరీక్షల్లో విద్యార్థులు జాగ్రత్తలు పాటించి అద్భుతంగా రాసి ఘనవిజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. వేడుకల లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా విద్యార్థులు డాక్టర్ నరేందర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. తమ విజయానికి తోడ్పడిన ఉపాధ్యాయులను కూడా విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళ శక్తే ఈనాడు దేశ భవిష్యత్తు–డీటీసీ యం. పురేంద్ర

విజయవాడ,మార్చి9: ప్రభుత్వ కార్యాలయల్లో పనిచేస్తున్న మహిళలు ఒకపక్క కుటుంబం రెండో పక్క ఉద్యోగ బాధ్యతలను నెరవేరుస్తూ నేటి సమాజానికి ఆదర్శంగా ఉంటున్నారని డీటీసీ యం. పురేంద్ర అన్నారు. స్థానిక బందరు రోడ్డులోని డీటీసీ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్స వం పురస్కరించుకొని మహిళ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీటీసీ ఎం పురేంద్ర ముఖ్య అతిథులుగా హాజరైనారు.

ఈ సందర్భంగా డీటీసీఎం పురేంద్ర మాట్లాడుతూ మహిళల హక్కులు, మహిళా కార్మికులకు సమాన వేతనం, మెరుగైన పని పరిస్థితులు, ఓటు హక్కు మొదలగు వాటిపై ఆనాడు మహిళలు ఉద్యమాలు చెప్పట్టారని ఆయన అన్నారు. దాని ఫలితమే ఈనాడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని ఆయన తెలిపారు.

# ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టవద్దు

## –కలెక్టర్ గరిమ అగ్రవాల్
## –ప్రజావాణికి 179 దరఖాస్తుల రాక

రాజన్న సిరిసిల్ల, మార్చి 9: నేటినిజం (ప్రతినిధి): ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో పెట్టవద్దని



కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 179 దరఖాస్తుల రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ శాఖకు 53, గృహ నిర్మాణ శాఖకు 29, డీఆర్డీఓ – 20, సంక్షేమ శాఖకు – 14, జిల్లా పంచాయతీ కార్యాలయం, ఎండీ సెస్ – 12, ఉపాధి కల్పన శాఖ, వైద్య శాఖ, ఈఈ పీఆర్ కు చొప్పున – 04, పౌర సరఫరాల శాఖ, ఎస్సీ సంక్షేమ శాఖ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు మూడు చొప్పున – 03, విద్యా శాఖ, ఈఈ ఆర్ అండ్ బీ, నీటి పారుదల శాఖ, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, మిషన్ భగీరథకు రెండు చొప్పున, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా ప్రణాళిక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, ఎక్సైజు శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, డీపీఆర్ఓ, పశు సంవర్ధక శాఖ, ఎస్పీ కార్యాలయానికి ఒకటి చొప్పున వచ్చాయి. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ మున్సిపల్ సాధారణ సమావేశం

## – 22 ఎజెండా అంశాలకు ఆమోదం
## –అభివృద్ధి పనులపై పాలకవర్గం చర్చ

రాజన్న సిరిసిల్ల, మార్చి 9: నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్



పుల్కం రాజు అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎజెండాలో పొందుపరిచిన 16 అంశాలు, టేబుల్ ఎజెండాలోని 6 అంశాలను పాలకవర్గ సభ్యు లు చర్చించి ఆమోదం తెలిపారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాటా ్లడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని తెలిపారు.

పాలకవర్గ సభ్యుల సహకారం, అధికారుల సమన్వయంతో ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొ న్నారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు తమ తమ వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు.

ఈ సమావేశంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ కే. సంపత్ కుమార్, టీపీఎస్ జి. అభినవ్, ఏఈ అనన్య, సానిటరీ ఇన్స్పెక్టర్ ఎస్. సుకుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది మరియు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# సాఫ్ట్వేర్ అబ్దుల్ ఇర్ఫాన్ నివాసంలో ఇఫ్తార్ విందు..



రాజన్న సిరిసిల్ల, మార్చి 9: నేటినిజం ప్రతినిధి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలో సోమవారం సాయంత్రం అబ్దుల్ సత్తార్ తనయుడు సాఫ్ట్వేర్ అబ్దుల్ ఇర్ఫాన్ తన నివాసంలో ముస్లిం సోదర, సోదరీమణుల కోసం ప్రత్యేక విందును ఏర్పాటు చేశారు. రోజంతా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలు సాయంత్రం ప్రార్థనల అనంతరం విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలువురు ప్రముఖులు, మత పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని సహపంక్తి భోజనం చేస్తూ సోదరభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ మాట్లాడుతూపవిత్ర రంజాన్ మాసంలో తోటి సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. తన పిలుపును మన్నించి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షులు అక్రమ్, ఏఎస్ఐ మజర్ పాషా, జర్నలిస్టులు అబ్దుల్ మన్నన్, లాయక్ పాష, తాహేర్ పాషా , రసూల్, హబీబ్ పాషా, ఇమ్రాన్,ఖజా నైముద్దీన్, కిడ్స్ కాన్వెంట్ స్కూల్ డైరెక్టర్ పసివుల్లా, పలు మస్జిద్ కమిటీ అధ్యక్షులు షేకి ఇమామ్, నవాబ్,సర్వర్ పాష, బషీర్, ముస్లిం కమిటీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షాహిద్ , కాంగ్రెస్, బీ ఆర్ఎస్ మైనార్టీ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మొహమ్మద్, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట

## –ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, మార్చి 9: నేటినిజం (ప్రతినిధి): మహిళా



సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ అర్బన్ మండలంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పర్యటిం చారు.. వేములవాడ అర్బన్ మండలం అనుపురం మారుపాక చీర్లవంచ గుర్రవానిపల్లి, కోడుముంజ గ్రామాల్లో 50 లక్షలతో ఐదు మహిళా సమైక్య సంఘం నిర్మాణానికి విప్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తున్నాయని తెలిపారు

మహిళలు సాధికారత సాధించే వరకు ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందన్నారు. మహిళలు వారి కాళ్ల మీద వారు నిలబడేలా ఆర్థికంగా నిలబెడుతూ వ్యాపార రంగంలో నిలదొక్కుకునేలా చర్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని అందులో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని సంకల్పించారని తెలిపారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి మహిళా తల్లులను లక్ష అధికారులు చేయాలని పావలా వడ్డీ రుణాలు అందించి మహిళా సంఘాలకు బలమైన ఊతమిచ్చారని గుర్తు చేశారు.

మహిళలను లక్ష్యాధికారులుగా తీర్చిదిద్దాలని ఆయన సంకల్పించారని తెలిపారు. అయితే గత ప్రభుత్వం మహిళా సంఘాలను పట్టించుకో కుండా, సభ్యులను కేవలం సమావేశాలకు మాత్రమే పరిమి తం చేసిందని విమర్శిం చారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో మహిళా సంఘాలపై ప్రత్యేక దృష్టి సారిం చామని, ఇప్పటి వరకు మూడు సార్లు మహిళా సంఘాలు చెల్లించిన వడ్డీ మొత్తాన్ని వారి ఖా తాల్లో జమ చేశామని వెల్లడిం చారు. మహిళల సాధికారత కోసం మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, గృహలక్ష్మి పథకం ద్వారా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 5 లక్షల ఆర్థిక సహాయం,500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందించే పథకం వంటి కార్యక్రమాలు ప్రజలకు ఉపశమనం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com